దినపత్రికలతో విజ్ఞానం పొందవచ్చు

విశాలాంధ్ర - టెక్కలి : ప్రతిరోజు ఉదయం దినపత్రికలు చదవడం ద్వారా విజ్ఞానం పెంపొందించుకోవచ్చుని శాఖ గ్రంథాలయ అధికారిని బి.రూపవతి అన్నారు. వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా మండల కేంద్రంలో ఉన్న శాఖ గ్రంథాలయంలో సోమవారం విద్యార్థులకు ఉపాధ్యాయులు పి రమేష్ ఆధ్వర్యంలో దినపత్రికలు చదివే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి రోజు దిన పత్రికలు చదవడం వలన ప్రపంచ విషయాలు తెలుస్తాయని, తద్వారా విజ్ఞాన వంతులు అవుతారని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ సహాయకులు రీడర్స్ పాల్గొన్నారు.

కార్పొరేట్ ప్రైవేట్ విద్యాసంస్థల ఫ్లెక్సీలు తొలగించాలి

ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శ సిహెచ్.రవి

విశాలాంధ్ర - పలాస : పలాస కాశీబుగ్గ మున్సిపాలిటీలో విచ్చల విడిగా కార్పొరేట్ ప్రైవేట్ విద్య సంస్థల ప్రచారం కొరకు అతికించిన ఫ్లెక్సీలు తొలగించాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి సిహెచ్ రవి డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం పలాస మున్సిపల్ కమిషనర్ రామారావుకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా ప్రధాన కార్యదర్శి సిహెచ్ రవి మాట్లాడుతూ.. శ్రీకాకుళం జిల్లాలో కార్పొరేట్ ప్రైవేట్ విద్యాసంస్థల యాజమాన్యాలు విద్యా సంవత్సరం ప్రారంభం కాకముందే శ్రీ చైతన్య నారాయణ, భాష్యం, ఎస్సార్ కార్పొరేట్ ప్రైవేట్ విద్యాసంస్థలు ముందస్తుగా అడ్మిషన్లు చేస్తున్నారని మండిపడ్డారు .అడ్మిషన్లతో పాటు మరో వైపు విద్యాసంస్థల పేరుతో ముద్రించిన పుస్తకాలను వేల రూపాయలకు అమ్ముతూ తల్లితండ్రులను మోసం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం విద్యాసంస్థల పేరుతో ముద్రించిన పుస్తకాలు అమ్మకూడదని నిబంధన ఉన్నప్పటికీ పుస్తకాలు యూనిఫాం, షూ టై బెల్ట్ వంటి రకరకాల వస్తువులు విద్యా సంస్థలలో వేల రూపాయలకు అమ్ముతున్నారని పేర్కొన్నారు, ఒక విద్యాసంస్థలతో అనుమతి తీసుకొని రెండు మూడు విద్యాసంస్థలు నడుపుతున్నారని తెలిపారు, జిల్లాలో చాలా విద్యాసంస్థలకు అనుమతులు లేకపోయినా నడుపుతున్న జిల్లా విద్యాశాఖ అధికారులు ఏం చేస్తున్నారని ప్రశ్నించారు.అనుమతులు లేకుండా హాస్టళ్లు అద్దె భవనాలలో నిర్వహిస్తున్నారని తెలిపారు,, ఇంటర్మీడియట్ విద్యార్థులకు సెలవు దినాలలో ఫస్ట్ ఇయర్ పూర్తిచేసుకున్న వారికి సెకండియర్ తరగతులు నిర్వహిస్తున్న ఆర్ఐఓ వారిపైన ఏం మాత్రం చర్యలు తీసుకోకుండా ఉన్నారని ఆందోళన వ్యక్తం చేశారు. తక్షణమే కళాశాలలో నిర్వహిస్తున్న వాటిని సీజ్ చేయాలని డిమాండ్ చేశారు, జిల్లాలో ఆర్ఐఓ డీఈవో స్పందించి ముందస్తు అడ్మిషన్లు చేస్తున్న కార్పొరేట్ విద్యాసంస్థల పైన అనుమతులు లేకుండా నడుపుతున్న విద్యా సంస్థల పైన ప్రభుత్వం నిర్ణయించిన ఫీజులు పాటించకుండా లక్షల రూపాయలు వసూలు చేస్తున్న కార్పొరేట్ విద్యాసంస్థల పైన చర్యలు తీసుకోకపోతే జిల్లా వ్యాప్తంగా పెద్ద ఎత్తున ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామని ఈ సందర్భంగా హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ కే సాయి, చైతన్య, జగదీష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

అక్రమ మద్యం అమ్మకాలతో పట్టుబడిన వ్యక్తులు

విశాలాంధ్ర - రణస్థలం : రాత్రి జెఆర్ పురం ఎస్ఐ చిరంజీవి మద్యం అక్రమ రవాణా గురించి వచ్చిన సమాచారం మేరకు సంచాం గ్రామం జంక్షన్ వద్ద ఇద్దరు వ్యక్తులు ఒక పల్సర్ మోటార్ సైకిల్ పై మధ్యలో మూడు అట్ట పెట్టెలు పట్టుకొని వస్తుండగా పోలీసులను చూసి పారిపోవుటకు ప్రయత్నించగా పోలీసులు వారిని పట్టుకుని పరిశీలించారు. అందులో మద్యం బాటిల్స్‌తో పాటు వ్యక్తుల పేర్లు వివరాలు మీసాల రాము, పండు, గంట్యాడ సాయి కుమార్ అక్రమంగా ఆదాయం పొందు నిమిత్తం వివిధ మద్యం షాపుల్లో మద్యం కొని వారి గ్రామంలో తన స్నేహితుడైన బొంతు గణేష్ తో కలిసి అమ్ముతూ అధిక ఆదా యం పొందుతున్నట్లు తెలిపాడు, రాముని తీసుకెళ్లి చూడగా తన స్నేహితుడు బొంతు గణేష్ కూడా మద్యముతో పట్టుబడుగా మొత్తం గా ముగ్గురు వ్య క్తులు నుండి 193 మద్యం బాటళ్లను, పల్సర్ బైకును సీజ్ చేసి ముగ్గురు వ్యక్తుల్ని అరెస్టు చేసి కేసు నమోదు చేసి రిమాండ్‌కి తరలించామన్నారు.

ప్రజా ఫిర్యాదులు పరిష్కరించుటలో జాప్యం ఉండరాదు

జిల్లా ఎస్పీ కెవి మహేశ్వరరెడ్డి

విశాలాంధ్ర - శ్రీకాకుళం సోర్ట్స్/క్రైం : ప్రజా ఫిర్యాదులు స్వీకరణ పరిష్కార కార్యక్రమంలో వచ్చే ప్రజా పిర్యాదులకు ప్రాధాన్యత ఇస్తూ జాప్యం లేకుండా త్వరితగతిన పరిష్కరించాలని జిల్లా ఎస్పీ కె.వి మహేశ్వర రెడ్డి పోలీసు అధికారులను ఆదేశించారు. చట్ట పరిధిలో చర్యలు చేపట్టి బాధితులకు న్యాయం చేయాలని జిల్లా ఎస్పీ పోలీసు అధికారులను సూచించారు. సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల నమోదు పరిష్కార వేదిక కార్యక్రమంలో జిల్లా ఎస్పీ 45 మంది ప్రజల నుంచి పిర్యాదులు స్వీకరించి, వారితో ముఖాముఖి మాట్లాడి, ఫిర్యాదు దారుల సమస్యలను తెలుసుకొని పూర్తి స్థాయిలో పరిష్కరిస్తామని భరోసా కల్పించారు.ఫిర్యాదు దారుల అర్జీలు, వారి వివరాలు సంబంధిత పోలీసు అధికారులకు జూమ్ కాన్ఫరెన్స్ ద్వారా తక్షణమే సంబధిత పోలీసు అధికారులకు తెలియ పరిచి చట్ట ప్రకారం చర్యలు తీసుకొని బాధితులకు న్యాయం చేయాలని అదేశించారు. ఈ క్రమంలో జిల్లా ఎస్పీ స్వయంగా అర్జీదారులతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. ఆయా ఫిర్యాదులపై తీసుకున్న చర్యలను నిర్ణీత సమయంలో జిల్లా పోలీస్ కార్యాలయానికి నివేదిక రూపంలో పంపించాలని ఎస్పి అధికారులు ఆదేశించారు. ఈ క్రమంలో నడవలేని వృద్ధులు, వికలాంగుల వద్దకు జిల్లా ఎస్పీ వెళ్లి వారి సమస్యలు తీసుకొని సమస్యలు పట్ల సానుకూలంగా స్పందించి పరిష్కారం చూపిస్తాను అని భరోసా కల్పించారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ కెవి రమణ పాల్గొన్నారు.

త్వరలో పాలిటెక్నిక్ కళాశాల ఏర్పాటు : ఎమ్మెల్యే ఎంజిఆర్

విశాలాంధ్ర - హిరమండలం/పాతపట్నం : గత ఎన్నికల్లో హామీల్లో భాగంగా పాతపట్నం నియోజక వర్గానికి ప్రభుత్వ పాలిటెక్నికల్ కళాశాల మంజూరుకు కృషి చేస్తానని హామీ ఇచ్చిన ప్రస్తుత శాసనసభ్యులు మామిడి గోవిందరావు అనతి కాలంలోనే రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు కు అలాగే రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ బాబుకు పలుమార్లు విన్నవించడంతో ఎమ్మెల్యే సిఫార్సును పరిగణలోకి తీసుకొని త్వరలో స్థల పరిశీలన చేయమని అధికారులకు ఆదేశాలు జారీ చేశారని సోమవారం ఎమ్మెల్యే మామిడి విలేకరుల కు తెలిపారు. అతి కొద్ది రోజుల్లో పాతపట్నం నియోజకవర్గ కేంద్రంలో ప్రభుత్వ పాలిటెక్నికల్ కళాశాల ఏర్పాటుకు సన్నాహాలు చేయనున్నారు. ప్రభుత్వ పాలిటెక్నికల్ కళాశాల ఏర్పాటుకు సహకరించినందుకు విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ కు నియోజకవర్గం ప్రజల తరఫున ఎమ్మెల్యే కృతజ్ఞతలు తెలియజేశారు. అలాగే ఇచ్చిన హామీని నిలబెట్టుకున్నందుకు ఎమ్మెల్యే మామిడి గోవిందరావుకి తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, నియోజకవర్గవిద్యార్థులు ధన్యవాదాలు తెలిపారు.

ప్రభుత్వ పాఠశాలలను పర్యవేక్షించండి

ప్రభుత్వానికి ఏపీటీఎఫ్ విన్నపం

విశాలాంధ్ర - సోంపేట : ప్రభుత్వ పాఠశాలలను ఇష్టానుసారంగా సుదూర పాఠశాలల్లో విలీనం చేసి గ్రామీణ ప్రాంతాల్లో ప్రభుత్వ పాఠశాలలను నిర్వీర్యం చేయడం తగదని వాటిని పరిరక్షించాలని సోంపేట, కంచిలి మండలాల ఎపిటిఎఫ్ ప్రతినిధులు ప్రభుత్వానికి విన్నవించారు. ఈ మేరకు సోమవారం సోంపేట తహశీల్దార్ జి.అప్పలస్వామికి వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సమాచారాన్ని ప్రభుత్వానికి నివేదించాలని కోరారు. వివరాల్లోకి వెళితే అన్ని ప్రాథమిక పాఠశాలలో 5 తరగతులు కొనసాగించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ ఉన్నత పాఠశాలలకు పూర్వ ప్రాథమిక విద్యను అనుసందానం చేయాలని కోరారు. ఈ సమస్యలపై ఎపిటిఎఫ్ దశల వారి పోరాటం నిర్వహిస్తుందని అన్నారు. విద్యాసమస్యలపై ఉపాధ్యాయులు తహశీల్దార్ కార్యాలయం వద్ద నిరసన చేపట్టారు. కార్యక్రమంలో ఎపిటిఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు జి.భీమారావు, రాష్ట్ర కౌన్సిలర్ జి.రాజేష్, సోంపేట, కంచిలి, మందస మండలాల ప్రతినిధులు కె.పాపారావు, జి.తిరుపతిరావు, ఎన్‌కె పండా, ఈశ్వరరావు, హరి, నారాయణరావు తదితరులు పాల్గొన్నారు.

శ్రీకాకుళంపై ఇచ్ఛాపురం ఘన విజయం

122 ఆదిక్యంతో విధ్వంసం

విశాలాంధ్ర - ఆముదాలవలస : ఆముదాలవలస కళాశాల మైదానంలో ఎమ్మెల్యే కప్పు టీ20 క్రికెట్ మ్యాచ్‌లో శ్రీకాకుళం జట్టుపై ఇచ్ఛాపురం జట్టు ఘన విజయం సాధించింది. సోమవారం జరిగిన ఈ మ్యాచ్లో సీఎం సిసి ప్రతినిధి తమ్మినేని విద్యాసాగర్ నేతృత్వంలో ఇరు జట్లను పరిచయం చేసుకుని టాస్ వేశారు. టాస్ గెలిచి మొదటి బ్యాటింగ్ చేసిన ఇచ్ఛాపురం నిర్ని

త 20 ఓవర్లలో 219 పరుగులు చేశారు. తరువాత బాటింగ్ చేసిన శ్రీకాకుళం హడ్కో కాలనీ 16 ఓవర్ లలో 97 పరుగులకు అల్ అవుట్ అయిపోయారు. దీంతో 122 పరుగులు తేడాతో ఇచ్ఛాపురం జట్టు విజయం సాధించింది. పది రోజులుగా జరుగుతున్న క్రికెట్ మ్యాచ్ లలో అత్యధిక స్కోరు ఇచ్ఛాపురం టీం చేసింది. ప్రత్యర్థులను పడగొట్టడంలో సమన్వయంతో వ్యవహరించి 122 పరుగులు ఆదిక్యం తో విధ్వంసం సృష్టించారని చెప్పాలి. ఆద్యాంతం ఇచ్ఛాపురం జట్టు అటు బ్యాటింగ్ లోను ఇటు బౌలింగ్ లోను విధ్వంసకరం సృష్టించి మ్యాచ్ను ఏకపక్షంగా మలుచుకున్నారు. ఈ మ్యాచ్ కి ముఖ్య అతిదిగా ఎంఈఓ రాజేంద్రప్రసాద్ విచ్చేసి విజేతలను అభినందించారు. టోర్నమెంట్ ఆర్గనైజర్ తమ్మినేని విద్యాసాగర్ మరియు లోకల్ బాయ్స్ పాల్గొన్నారు.

మెమోరియల్ క్రికెట్లో సెమీఫైనల్‌కు చేరిన టెక్కలి టీం

విశాలాంధ్ర - నరస న్నపేట : స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో వైఎం సిపి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న క్రికెట్ పోటీల్లో టెక్కలి క్రికెట్ టీం సెమీఫైనల్కు చేరింది. కరకవలస రమేష్, ధర్మాన చంద్రశేఖర్ మెమోరియల్ క్రికెట్ టోర్నమెంట్లో నరసన్నపేట టీంతో టెక్కలి క్రికెట్ టీం సోమవారం తలపడింది. ఈ పోటీల్లో టెక్కలి టీం విజయం సాధించి, మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్‌గా వంశీ ఎంపికయ్యారు. వంశీకి వైఎంసిపి సెక్రటరీ, గొద్దు చిట్టి బాబు బహుమతిని అందజేసి, అభినందనలు తెలియ జేశారు. ఈ కార్యక్రమంలో వైఎంసిపి, అధ్య క్షులు, కరకవలస శ్రీకాంత్ (బప్పి), ప్రతినిధులు, వారణాసి రమేష్, ఎస్.రాము, శివాజీ పాల్గొన్నారు.

వంతెన నిర్మాణానికి 3.88 కోట్లు మంజూరు

ఎన్నికల్లో ఇచ్చిన హామీ నిలబెట్టుకున్న ఎమ్మెల్యే శిరీషా

విశాలాంధ్ర - వజ్రపుకొత్తూరు : మండలంలో పూడిలంక ప్రజలు ఎన్నో ఏళ్లుగా ఎదురు చూస్తున్న వంతెన నిర్మాణానికి ఎమ్మెల్యే గౌతు శిరీషా ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు 3 కోట్ల 88 లక్షల రూపాయలు మంజూరు చేయించారని రాష్ట్ర అగ్నికుల క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ పుచ్చ ఈశ్వరరావు అన్నారు. సోమవారం ఆయన వజ్రపుకొత్తూరు మండల టీడీపీ అధ్యక్షులు సురాడ మోహనరావు, మండల టీడీపీ ప్రధాన కార్యదర్శి కర్ని రమణతో కలిసి పూడిలంక గ్రామాన్ని పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టీడీపీ ప్రభుత్వ హయాంలో (2014-2019) అప్పటి ఎమ్మెల్యే గౌతు శివాజీ పల్లివూరు జంక్షన్ నుంచి పూడిలంకకు గ్రావెల్ రోడ్డుకు నిధులు మంజూరు చేయించారని, చాలా వరకు నిర్మాణ పనులు చేపట్టగా తర్వాత వచ్చిన ప్రభుత్వం వంతెన నిర్మాణానికి హామీ ఇచ్చి విస్మరించిందన్నారు. గతేడాది ఎన్నికల ప్రచారంలో టీడీపీ అభ్యర్థి శిరీషా కూటమి అధికారంలోకి వస్తే వంతెన నిర్మాణ పనులు చేపడతామని పూడిలంక గ్రామస్తులకు హామీ ఇచ్చారు. ఈ మేరకు ఎమ్మెల్యేగా గెలిచిన తరువాత సి.ఎం చంద్రబాబు, డిప్యూటీ సి.ఎం పవన్ కళ్యాణ్‌ను కలిసి పూడిలంక దుస్థితిని వివరించారు. కేంద్ర, రాష్ట్ర మంత్రులు రామ్మోహనాయుడు, అచ్చెన్నాయుడులకు కూడా అనేక సార్లు పూడిలంక వంతెన నిర్మాణాలు నిధులు కేటాయించాలని కోరారు. ఇటీవల కలెక్టర్‌ను కూడా కలిసి ఈ విషయమై విజ్ఞప్తి చేశామన్నారు. దీంతో కలెక్టర్ స్పందిస్తూ 3 కోట్ల 88 లక్షల రూపాయలతో బ్రిడ్జి నిర్మాణం చేపడుతున్నట్లు గ్రామస్తులు తెలిపారు. కార్యక్రమంలో బి.శశిభూషణ, దాసరి జేజేరావు, సింగుపల్లి బాలక్రిష్ణ, తెప్పల చాణుక్య, బొంపల్లి శివ, కుంది దుర్గారావు, అరసవల్లి ఉమామహేశ్వరరావు, గోవింద పాపారావు, పోతనపల్లి సాంబమూర్తిలు పాల్గొన్నారు.

జీవో నెంబర్ 77ను రద్దు చేయకుండా ఐసెట్ పరీక్ష నిర్వహిస్తే అడ్డుకుంటాం

ఏబీవీపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సిగిలిపల్లి మదన్ కుమార్

విశాలాంధ్ర - టెక్కలి : విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని జీవో నెంబర్ 77 రద్దు చెయ్యాలని అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సిగిలిపల్లి మదన్ కుమార్ డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ గత ప్రభుత్వం 2020లో తీసుకువచ్చినటువంటి జీవో నెంబర్ 77 ప్రైవేట్ కళాశాలలో పీజీ విద్యను అభ్యసించాలి అనుకునే పేద విద్యార్థుల పాలిట శాపంగా తయారయ్యిందిని, ఆనాడు జీవో నెంబర్ 77 ఆమోదం లోకి వచ్చిన రోజు నుండి ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఏబీవీపీ ఎన్నో ఉద్యమాలను చేసి గత ప్రభుత్వ నాయకులకు నిద్ర లేకుండా చేసిందిని మండిపడ్డారు. అది అలా ఉంచితే ఎలక్షన్ కి ముందు నేటి విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ తాము ప్రభుత్వంలోకి వచ్చిన వెంటనే జీవో నెంబర్ 77రద్దు చేస్తామని తాను చేసిన యువగలం పాదయాత్రలో చాలాసార్లు ప్రస్తావించారని గుర్తు చేశారు. కాగా వారి ప్రభుత్వం వచ్చి 327 రోజులు గడిచినా ఇంకా జీవో నెంబర్ 77 గురించి పట్టించుకోకపోవడం వారికి విద్యార్థుల మీద ఉన్న చిత్తశుద్ధి అర్థమవుతుంది. అది అలా ఉంచితే మే 7 2025 న ఐసిఈటీ ప్రవేశ పరీక్షలు జరగబోతున్నాయి. ఈ ఒక్క జీవో నెంబర్ 77 రద్దు చేయకుండా ఐసిఈటీ పరీక్షలు నిర్వహిస్తే ప్రైవేట్ కళాశాలలో ఎంబీఏ, ఎంసీఏ చదవాలనుకునే పేద విద్యార్థుల పరిస్థితి ఏంటి అని నేడు ప్రభుత్వాన్ని ఏబీవీపీ నిలదీస్తుంది. ఐసిఈటీ పరీక్షలకు ముందే జీవో నెంబర్ 77 ని రద్దు చేస్తున్నట్లు ప్రకటించాలి అని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నట్లు తెలియజేశారు. అలా రద్దు చేస్తున్నట్టు ప్రకటించకపోతే ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఎన్ని ఉద్యమాలను చెయ్యడానికి అయిన ఏబీవీపి వెనకడుగువెయ్యదని హెచ్చరిస్తున్నామని తెలిపారు.

ఐతంలో నూతన పుస్తకావిష్కరణ

విశాలాంధ్ర - టెక్కలి : ఆదిత్య ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ మేనేజ్మెంట్ ఇంజనీరింగ్ కళాశాల ఎంబిఎ విభాగంలో అసిస్టెంట్ ప్రొఫెసర్గా విధులు నిర్వహిస్తున్న వి.గోపాలకృష్ణ, డీన్ డాక్టర్ డి.విష్ణుమూర్తి, అసోసియేట్ డీన్ డాక్టర్ కె.వేణుగోపాల్ లు నూతననంగా రచించిన ఎకనమిక్స్ అండ్ మేనేజ్మెంట్ సైన్స్ ఫర్ ఇంజినీర్స్ అనే పుస్తకాన్ని కళాశాల డైరెక్టర్ ప్రొఫెసర్ వి.వి.నాగేశ్వరరావు సోమవారం తన చాంబర్లో ఆవిష్కరించారు. అన్ని బిటెక్ ఇంజినీరింగ్ కోర్సుల విద్యార్థులకు ఈ పుస్తకం ఎంతగానో ఉపయోగపడుతుం దన్నారు. డైరెక్టర్ ప్రొఫెసర్ వివి.నాగేశ్వరరావు, ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ.ఎస్.శ్రీనివాసరావు, డాక్టర్ డి.శ్రీరాములు, డాక్టర్ బి. శివకుమార్ లు పాల్గొని రచయితలను అభినందించారు.

గుజరాత్‌లో వీర మహిళలకు కిట్లు పంపిణీ

విశాలాంధ్ర - వజ్రపుకొత్తూరు : జనసేన సేవా ట్రస్ట్ కచ్ గుజరాత్ అధ్యక్షులు మూగి. వేణుబాబు ఆధ్వ ర్యంలో గుజరాత్ రాష్ట్రంలో క్రియాశీల సభ్యత్వాలు నమోదు చేసుకున్న జనసైనికులకి, వీర మహిళలకు సోమవారం కిట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వేణు బాబు మాట్లాడుతూ జనసేన పార్టీ సభ్యత్వం తీసుకున్న జన సైనికులకు ప్రమాద బీమాపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో వజ్రపు కొత్తూరు మండలం జనసేన నాయకులు రిషి వడ్డీ, రాజేష్, జల్దీ బాల, కోనేరు ధర్మారావు, జోగారావు, సోమేశ్వరరావు, మధు, అశ్విన్ చలం కుమార్ సింహాచలం సుధీర్‌తో పాటుగా వీర మహిళలు సుజాత, రాఖీ, ఊర్మిలమ్మ, జయలక్ష్మి, దాసరి లక్ష్మి, కాస కృష్ణవేణి, పావని, లక్ష్మి పాల్గొన్నారు.

రహదారి పనులు త్వరితగతిన పూర్తి చేయాలి

అధికారులను ఆదేశించిన రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు

విశాలాంధ్ర సంతబొమ్మాళి/ కోటబొమ్మాళి : టెక్కలి నియోజకవర్గంలో చేపడుతున్న అభివృద్ధి త్వరితగతిన పూర్తి చేయాలని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అధికారులను ఆదేశించారు. కోటబొమ్మాళి మండలం నిమ్మాడ క్యాంప్ కార్యాలయంలో సోమవారం రహదారు, భవనాల శాఖ, పంచాయతీ రాజ్, గ్రామీణ నీటి సరఫరా విభాగం అధికారులతో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. సీసీ రహదారులు, అనుకున్న సమయం కంటే ముందుగానే పూర్తిగా చేయాలని సూచించారు. మట్టి రహదారులన్నీ సీసీ రహదారులుగా నిర్మాణం చేపట్టాలని తెలిపారు. ఇంకా ప్రారంభం కాని పనులు ఉంటే వేంటనే టెండర్లు పిలవాలని అధికారులకు సూచించారు. అన్ని గ్రామాల్లో మౌలిక సదుపాయాలు కల్పించేందుకు కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని చెప్పారు. అధికారులు రవికాంత్, తిరుపతిరావు, తదితరులు పాల్గొన్నారు.

రక్తదానంపై అపోహాలు వీడండి

రెడ్ క్రాస్ చైర్మన్ జగన్‌మోహనరావు

విశాలాంధ్ర - శ్రీకాకుళం టౌన్ : యువత రక్తదానంపై అపోహాలు వీడి రక్తదానం చెయ్యాలని రెడ్ క్రాస్ చైర్మన్ వి.జగన్‌మోహనరావు సోమవారం పిలుపు నిచ్చారు. నగరంలో ఒక మహిళకు స్త్రీలకు సంబంధించిన శస్త్రచికిత్స అవసరం రాగా, రక్తం తక్కువ కారణంతో శస్త్రచికిత్స వాయిదాపడుతూ వచ్చిందని, అందుకు రక్త నమూనాలో అతి తక్కువగా దొరికే ఎబి నెగెటివ్ కావడమే నన్నారు. ఈ రోజు నగరానికి కొల్ల లక్ష్మణ రావు ముందుకు వచ్చి రక్తాన్నందించి శస్త్రచికిత్సకు వెసులుబాటు కల్పించారని, ఆయనెప్పుడు రక్తదానం చేయటానికైనా సిద్ధమనటం హర్షణీయమన్నారు. ముఖ్యంగా పత్రికా ప్రతినిధులు ప్రచురిస్తున్న కారణంగా కొంత మంది యువతలోనైనా మార్పు తీసుకువస్తున్నారని అందుకు ప్రత్యేక ధన్యవాదాలన్నారు. రక్తదాత కొల్ల. లక్ష్మణ రావు మాట్లాడుతూ రెడ్ క్రాస్ ప్రతినిధి నంది. ఉమా శంకర్ అందించిన సమాచారం మేరకు వచ్చానని, ఇప్పటివరకు తొమ్మిది సార్లు రక్తమందించానన్నారు. ఎవరికి అవసరమున్నా ఎబి నెగెటివ్ కొరకు నన్ను సంప్రదించవచ్చని, ప్రతీ మూడునెలకు రక్తదానం చేస్తానన్నారు. అనంతరం రక్తదాతకు రెడ్ క్రాస్ ప్రతినిధుల బృందం, లైన్స్ క్లబ్ శ్రీకాకుళం సెంట్రల్ మార్కెటింగ్ చైర్‌పర్సన్ ఉర్లం శివతేజ పట్నాయక్ లు ప్రశంసాపత్రంతోపాటు, బంగారు పతకాన్ని అందించారు. ఈ కార్యక్రమంలో రక్తదాత కొల్ల. లక్ష్మణ రావు, రెడ్ క్రాస్ రక్తనిధి కేంద్రం మేనేజర్ అయేషా. బేగం, ఎపిఆర్వో నంది ఉమా శంకర్, బి.జగదీష్ పాల్గొన్నారు.

గ్రామ స్థాయి కమిటీలు సకాలంలో పూర్తి చెయ్యండి

విశాలాంధ్ర - హిరమండలం/పాతపట్నం : సోమవారం పాతపట్నం టీడీపీ క్యాంప్ కార్యాలయంలో ఎమ్మెల్యే మామిడి గోవిందరావు ఆధ్వర్యంలో నియోజకవర్గ పరిధిలో గల క్లస్టర్ -యూనిట్ మరియు ముఖ్య నాయకులతో సమావేశం నిర్వహించి పార్టీ ప్రతిష్టతకు మరియు నియోజకవర్గ, మండల, గ్రామ స్థాయిలో చెయ్యవలసిన అభివృద్ధి కార్యక్రమలపై చర్చలు జరిపారు. అనంతరం పార్టీ ఆదేశాలు మేరకు నియోజకవర్గ స్థాయిలో చేపట్టిన పార్టీ గ్రామ స్థాయి నిర్వహణ పని తీరు పై చర్చించడం జరిగింది. ఇప్పటి వరకు జాతీయ టీడీపీ అధ్యక్షులు ఏపీ సీఎం నారా చంద్రబాబు నాయుడు ఆదేశాలు మేరకు కేఎస్ఎస్ 100 శాతం పూర్తి చేయడం జరిగిందన్నారు. అలాగే పార్టీ సంస్థగత ఎన్నికల్లో భాగంగ ముందుగా గ్రామ స్థాయి కమిటీలు త్వరగా పూర్తి చేసుకోవలసిందిగా దిశా నిర్దేశం చేసారు. ఈ కార్యక్రమంలో క్లస్టర్ ఇన్‌చార్జు, పైల బాబ్జి,అక్కంద్ర సన్యాసి, తూలుగు తిరుపతిరావు, యాళ్ల నాగేశ్వరరావు మరియు యూనిట్ ఇన్చార్జులు సైలాడ సతీష్, బుద్దల నరేష్, గోడ చందు తదితరులు పాల్గొన్నారు.

మూలిపాడు ఆలయ ప్రతిష్ఠలో రాజకీయ వివాదాలు

విశాలాంధ్ర - మందస : మండలం మూలిపాడు గ్రామంలో భక్తులు విరాళాలతో నిర్మించిన ముక్తేశ్వర స్వామి ఆలయంతో పాటు బుద్ధుని ఆలయం ప్రతిష్ట మహోత్సవం కార్యక్రమం ప్రారంభం కా కుండానే రాజకీయ వివాదం చోటుచేసుకుంది ఈ వివాదం ఎటువైపు దారితీస్తుందోనని భక్తులు ఆందోళన చెందుతున్నారు. దీనికి సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. ఈ గ్రామంలో ఆల యాలు నిర్మాణానికి నిర్మాణ కమిటీ ప్రతినిధులు సుమారు 15 లక్ష రూపాయల వరకు భక్తుల నుంచి విరాళాలు సేకరించి నిర్మాణ పనులు పూర్తయ్యేందుకు కృషి చేశారు. ఆలయం ప్రతిష్ట మహోత్సవానికి ముహూర్తం తేదీని ఖరారు చేశారు. ఈ ప్రతిష్ట మహోత్సవంలో వేలాది మంది భక్తులు పాల్గొనే విధంగా ఈ నెల 7, 8, 9 తేదీల్లో జరపాలన్న ఆలోచనతో ఆలయ నిర్మాణ కమిటీ భక్తులు నిర్ణయం తీసుకున్నారు. ఈ నేపథ్యంలో మూలిపాడు పంచాయతీ మాజీ సర్పంచ్ వర్గీయులు ఆలయం ప్రతిష్ట మహోత్సవ తేదీలను మార్చాలంటూ నిర్మాణ కమిటీ ప్రతినిధులపై ఒత్తిడి తెచ్చి ఆలయం తలుపులకు తాళాలు వేశారు. దీంతో భక్తులు కమిటీ ప్రతినిధులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఆలయం ప్రతిష్ట మహోత్సవ కార్యక్రమాలకు సంబంధించిన కరపత్రాలు గ్రామాల్లో ప్రజలకు పంపిణీ తో పాటు వాల్ పోస్టర్స్ గ్రామాల్లో అంటించారు. ప్రత్యేక వాహనాల ద్వారా మైక్ ప్రచారం చేయించారు. మహోత్సవం ఏర్పాట్ల కోసం లక్షల్లో రూపాయలను అడ్వాన్సులు నిర్మాణ కమిటీ ప్రతినిధులు చెల్లించారు. ప్రతిష్ట మహోత్సవ తేదీ దగ్గర పడుతుండడంతో ఈ వివాదం చోటు చేసుకోవడంతో ఆలయం నిర్మాణ కమిటీ సభ్యులు భక్తులు ఆందోళన చెందుతున్నారు. ఆల యం నిర్మాణ కమిటీలో బిజెపి ప్రతినిధులు కీలకంగా ఉన్నారు. ఆలయం ప్రతిష్ట మహోత్సవం తేదీలను వాయిదా వేయాలంటూ పట్టుబడుతున్న వారు టిడిపికి చెందినవారు. దీంతో ఆలయం ప్రతిష్ట మహోత్సవం అంశంపై బీజేపీ టిడిపి వర్గాలు మధ్య పట్టుదల ఏర్పడింది.ఈ విషయంపై బిజెపితో పాటు దాని అనుబంధ సంఘాలు సభ్యులు స్థానిక పోలీస్ స్టేషన్‌ను ఆశ్రయించేందుకు సిద్ధమవుతున్నారు.

శాఖ గ్రంథాలయంలో మ్యూజికల్ చైర్ గేమ్, బుక్ రీడింగ్ కార్యక్రమం

విశాలాంధ్ర - జలుమూరు : మండల కేంద్రం సారవకోట బాపూజీ స్మారక గ్రంథాలయంలో సోమవారం మ్యూజికల్ గేమ్ మరియు పుస్తక పఠన కార్యక్రమా ఏర్పాటు చేశారు. వేసవి శిక్షణ తరగతులో భాగంగా ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు గ్రంథాలయ శాఖ అధికారిని డి సాయమ్మ తెలిపారు. సోమవారం జరిగిన కార్యక్రమంలో సుమారు 75 మంది హాజరైనట్లు తెలిపారు. ఆమెతో పాటు సహాయ అధికారి బుష్యశింగు రామకృష్ణ, వలువురు పాల్గొన్నారు. విజేతలకు చివరి రోజున బహుమతులు అందజేస్తామని సాయమ్మ తెలిపారు.

ప్రాంగణ నియామకాల్లో కాకినాడ ఆదిత్య మహిళా డిగ్రీ కళాశాల హవా

విశాలాంధ్ర - శ్రీకాకుళం టౌన్ : కొలువులకు సరైన వేదిక కాకినాడ ఆదిత్య మహిళా డిగ్రీ కళాశాల అని డైరెక్టర్ బిఎస్ చక్రవర్తి, ప్రిన్సిపాల్ కె శివశంకర్ తెలిపారు. ఉద్యోగాలు పొందిన విద్యార్థులకు అభినందన సభ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ డిగ్రీ పట్టా అందుకోకముందే ఇప్పటివరకు 500పైగా కార్పొరేట్ ఉద్యోగాలు సాధించడం శ్రీకాకుళం విద్యావ్యవస్థలో చరిత్ర సృష్టించామన్నారు. ఇంటర్ తర్వాత ఎం చేయాలనీ ఆలోచించకుండా డిగ్రీలో తమ పిల్లలను జాయిన్ చేసి వారి ఉజ్వల భవిష్యత్ కు దోహదపడాలని తల్లితండ్రులను సూచించారు. ప్రస్తుతం ఇంజనీరింగ్ కు దీటుగా కార్పొరేట్ కొలువులను డిగ్రీ మీద అందిస్తున్నామన్నారు. ఇందుకు కారణం డిగ్రీ మొదటి సంవత్సరం నుండే ఉద్యోగాలకు ఉపయోగపడే క్యాంపస్ రిక్రూట్మెంట్ ట్రైనింగ్ ఇవ్వడం జరుగుతోందన్నారు. ప్రస్తుత రోజులలో సాఫ్ట్వేర్ రంగాలలో ఎంతో ప్రాధాన్యత ఉన్న కోడింగ్ పైన విద్యార్థులకు ప్రత్యేక తరగతులను నిర్వహిస్తున్నాం అని, అంతేకాకుండా ఇంగ్లీష్ కమ్యూనికేషన్ పై మీ ప్రో,కంప్యూటర్ లాంగ్వేజ్ ల పై సిస్కో,ఒరాకిల్ అకాడమీ మొదలగు సంస్థలతో అవగహన ఒప్పందాలను చేసుకున్నాం అన్నారు. ఇవి విద్యార్థినిలకు ఉద్యోగాలు సాధించడంలో ప్రముఖ పాత్ర పోషిస్తున్నాయన్నారు. వీటితో పాటు ప్రతీ విద్యార్థి పై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటామన్నారు క్యాంపస్ కొలువులే కాకుండా అకడమిక్ పైన కూడా ప్రత్యేక శ్రద్ధ పెట్టి యూనివర్సిటీ స్థాయి పరీక్షా ఫలితాలలో మొదటి స్థానాలలో ఉంటున్నాం అన్నారు. తమ పిల్లలను ఉన్నతమైన కార్పొరేట్ ఉద్యోగాలలో ఉండాలని ప్రతీ తల్లిదండ్రులు ఆశిస్తారని ఆ కోరికను కాకినాడ ఆదిత్య మహిళా డిగ్రీ కళాశాలలు నిజం చేస్తున్నాయన్నారు. ప్రస్తుతం తమ కళాశాలలో అందిస్తున్న శిక్షణ ప్రభుత్వ ఉద్యోగాలకు కూడా ఉపయోగపడుతుందన్నారు. క్రమశిక్షణ,ఉత్తమ ఫలితాలు,కార్పొరేట్ కొలువులతో తమ కళాశాల శ్రీకాకుళం జిల్లాలో మొదటి స్థానంలో ఉందన్నారు.ఉద్యోగాలు సాదించిన విద్యార్థినిలను ఆదిత్య విద్యా సంస్థల చైర్మన్ డా ఎన్.శేషారెడ్డి,సెక్రటరీ డా ఎన్.సుగుణా రెడ్డి,అకడమిక్ డైరెక్టర్ డా బి.ఈ.వి.ఎల్ నాయుడు అభినందించారు.

ఆగని రైల్వే ఆక్రమణలు... పట్టించుకోని ఆ శాఖ అధికారులు

విశాలాంధ్ర - జలుమూరు : మండలం తిలారు రైల్వే స్టేషన్ పరిధిలో రైల్వే ఆస్తులు రోజురోజుకు ఆక్రమణల జోరు పెరుగుతున్నాయని పలువురు ఆరోపిస్తున్నారు. గతంలో స్టేషన్కు ప్రత్యేక రక్షణ గోడ ఉండేదని నేడు శిదిలమవడంతో అక్కడ ఉంటున్న ప్రజలు ఆక్రమించుకుని సొంత ఆస్తులులా వాడుకుంటున్నారు. ఈ మధ్యకాలంలో అధికారులు చూచి చూడనట్లు వ్యవహరించడం మరింత ఆక్రమణంలో చోటు చేసుకుంటున్నాయి. ఇటీవల కాలంలో ఆ ప్రాంతంలో కొందరు రైతులు పశువులను కడుతూ సాలలను తలపించే విధంగా ఆక్రమణలు జరుగుతున్నాయి. ఇప్పటికైనా రైల్వే శాఖ అధికారులు మరిన్ని ఆక్రములు జరగకముందే చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

తాళ్లభద్ర వద్ద వంతెన నిర్మాణానికి సుగమం

పలాస ఎమ్మెల్యే శిరీషకు ఉద్దానవాసులు కృతజ్ఞతలు

విశాలాంధ్ర - వజ్రపుకొత్తూరు : అసాధ్యాలను సుసాధ్యం చేస్తూ విపక్షాలను కూడా విస్మయానికి గురిచేస్తున్న నేత గౌతు శిరీష అని టీడీపీ నాయకులు పేర్కొన్నారు. పలాస నియోజకవర్గంలో అపరిష్కృతంగా ఉన్న ప్రధాన సమస్యలపై దృష్టి సారించి చక్కని ఫలితాన్ని అందిస్తున్నారని హర్షం వ్యక్తం చేసారు. ఉద్దాన ప్రాంతానికి ముఖ ద్వారంగా పిలవబడే తాళ్లభద్ర రైల్వే గేటు వద్ద పై ఓవర్ బ్రిడ్జి నిర్మాణానికి రైల్వే శాఖ ఉత్తర్వులు వెలువరించడంతో వజ్రపుకొత్తూరు మండలంలోని టీడీపీ నాయకులు గేటు ప్రాంతాన్ని సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దశాబ్దాలుగా ఈ సమస్య వేధిస్తోందని, పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష అధికారంలోకి వచ్చిన కొద్దిరోజుల్లోనే ఈ సమస్యను పరిష్కరించాలని ప్రశంసించారు. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో సగం సగం ప్రాతిపదికన నిధులు మంజూరవ్వడం, తర్వాత వచ్చిన వైసీపీ ప్రభుత్వం ఈ అంశాన్ని నిర్లక్ష్యం చేసిందన్నారు. అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పూర్తిగా రైల్వేశాఖ నిధులతో ఈ పనులను చేపట్టనున్నట్లు చెప్పారు. ఉద్దాన ప్రాంతం నుంచి అత్యవసర సమయాల్లో వైద్యం కోసం పలాస కాశీబుగ్గ జంట పట్టణాలకు వచ్చేవారు, గర్భిణులు ఎన్నో ఇబ్బందులకు గురయ్యేవారని గుర్తు చేసారు. ఇక్కడ పై ఓవర్ బ్రిడ్జి నిర్మాణానికి కృషి చేసిన ఎమ్మెల్యే శిరీషకు, బాసటగా నిలిచిన కేంద్రమంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడుకు కృతజ్ఞతలు తెలిపారు. ప్రజలు పడుతున్న ఇబ్బందులను అధిగమించేందుకు ఈ ప్రాంతంలో ఓవర్ బ్రిడ్జి నిర్మించేందుకు 2018 టీడీపీ హయాంలో ఈ బ్రిడ్జి నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం అనుమతులు మంజూరు చేసింది. అప్పట్లో యాభై శాతం కేంద్రం వాటా, యాభై రాష్ట్ర వాటా ప్రాతిపదిక పనులు చేపట్టేందుకు కేంద్రప్రభుత్వం ఉత్తర్వువచ్చింది. అనంతరం టీడీపీ ఓటమి పాలవ్వడం, వైసీపీ అధికారం లోకి రావడం జరిగిందన్నారు. ఈ అంశం జోలికి అప్పటి నేత అప్పలరాజు అస్సలు వెళ్లలేదని మండిపడ్డారు.

కూటమి ప్రభుత్వం రాకతో ప్రస్తుత ఎమ్మెల్యే శిరీష ఈ బ్రిడ్జి నిర్మాణ విషయమై కృషి చేసారని, ఈ నేపథ్యంలో కేంద్ర, రాష్ట్ర మంత్రులు కింజరాపు రామ్మోహన్ నాయుడు, అచ్చెన్నాయుడులు సహకరించడంతో కేంద్ర ప్రభుత్వమే నూటికి నూరు శాతం నిధులతో పనులు చేపట్టేందుకు ముందుకు వచ్చినట్లు వివరించారు.

పర్యాటకంగా ఉద్దానం అభివృద్ధి..

ఉద్దాన ప్రాంతంలో సువిశాల తీరప్రాంతముందని, అక్కుపల్లి, తోటూరు, వజ్రపుకొత్తూరు గ్రామాల్లోని సాగర తీరాల్లో ఎంతో ఆహ్లాదకర వాతావరణం ఉంటుందని అన్నారు. ప్రకృతి ఒడిలో సేద తీరేందుకు పర్యాటకుల అధికంగా వస్తారని, దీంతో పర్యాటకంగా ఉద్దాన ప్రాంతం అభివృద్ధి చెందుతుందని ఆశాభావం వ్యక్తం చేసారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు సూరాడ మోహనరావు, బుల్లోజు శశిభూషణరావు, దాసరి జేజేరావు, సింగుపల్లి బాలకృష్ణ, కొమర భారతి, తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి అధిక ప్రాధాన్యత నివ్వాలి

రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు

విశాలాంధ్ర - సంతబొమ్మాళి/కోటబొమ్మాళి : ప్రజా సమస్యల పరిష్కారానికి అధిక ప్రాధాన్యతనివ్వాలని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అధికారులకు ఆదేశించారు. సోమవారం కోటబొమ్మాళి మండలం నిమ్మాడ క్యాంప్ కార్యాలయం ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. వాటి పరిష్కారానికి ప్రత్యేకంగా కృషి చేయాలన్నారు. సమస్యల పరిష్కారానికి వివిధ శాఖల అధికారులతో మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, అధికారులు, ప్రజలు పాల్గొన్నారు.

సీపీఎస్ రద్దు పై ఏపీటీఎఫ్ నిరసన

విశాలాంధ్ర - ఆమదాలవలస : ఏపీటీఎఫ్ రాష్ట్ర శాఖ పిలుపు మేరకు ప్రభుత్వ పాఠశాలల పరిరక్షణకై మరియు సిపిఎస్ రద్దు చేయాలన్న అంశంపై ఏపీటీఎఫ్ ప్రతినిధులు స్థానిక ఎమ్మార్వో కార్యాలయం వద్ద నిరసన వ్యక్తం చే సి సోమవారం వినతి పత్రాన్ని అందించారు. 2003 డీఎస్సీ వారికి వెంటనే ఓపిఎస్ అమలు చేయాలని, పిఆర్సి కమిటీ నియమించి వెంటనే 30% ఐఆర్ ప్రకటించాలి అని పెండింగ్ డిఏలు పెండింగ్ బకాయిలు విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ వినతి పత్రంలో పేర్కొన్నారు. వేసవి సెలవులు అయినప్పటికీ ఆమదాలవలస తాలూకా కేంద్రంలో జిల్లా ఉపాధ్యక్షులు పేడాడ అప్పలనాయుడు ఆధ్వర్యంలో ఎమ్మార్వో రాంబాబుకు వినతి పత్రం అందించి ప్రభుత్వానికి నివేదించాలని కోరారు. ప్రస్తుత విద్యా విధానంలో ఆరు రకాల విద్యా వాదన ఉండగా దానిని పది రకాలుగా విడదీసి ఉపాధ్యాయుల సంఖ్యను ఒక్కోచోట ఒక్కోలాగా నిర్ణయిస్తూ ప్రభుత్వం ఉపాధ్యాయులపై కక్ష సా ధింపు చర్యలు చేస్తున్నట్లు అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కౌన్సిలర్ బి.చంద్రశేఖర్, జిల్లా ఆడిట్ కమిటీ కన్వీనర్ టి.సూర్యనారా యణ, ఆమదాలవలస అధ్యక్ష, ప్రధాన కార్య దర్శులు బి.సుందరరావు, బి.మహేష్, సరుబు జ్జిలి అధ్యక్షులు ఎస్.రామన్న, టి.విశ్వనాధం, సీనియర్ నాయకులు హెచ్.వి.సత్యనారాయణ, బి.వి.రమణ, పి.సూర్యనారాయణ, పి.అప్పా రావు మరియు కార్యకర్తలు పాల్గొన్నారు.

గ్రీవెన్స్‌లో వృద్ధురాలు ఆత్మహత్యాయత్నం

భూ సమస్యకు పరిష్కారం చూపించాలని ఆవేదన

విశాలాంధ్ర - శ్రీకాకుళం టౌన్ : జెడ్పీ సమావేశ మందిరంలో సోమవారం కలెక్టర్ నిర్వహించిన గ్రీవెన్స్‌లో బాకర్‌సాహెబ్‌పేటకు చెందిన వృద్ధురాలు లొట్టి మంగమ్మ ఆత్మ హత్యాయత్నానికి పాల్పడింది. గ్రీవెన్స్‌లో ఫిర్యాదు చేయడానికి వచ్చిన బాధితురాలు కలెక్టర్ స్వప్నిల్ దినకర్ ఎదుటే తనతో పాటు బాటిల్‌లో తెచ్చుకున్న పెట్రోల్ ఒంటిపై వేసుకుంది. దీన్ని గమనించిన కలెక్టర్, ఇతర ఉన్నతాధికారులు స్పందించి అక్కడే ఉన్న మహిళా పోలీసులను అప్రమత్తం చేయించి బాధితురాలి నుంచి బాటిల్ తీసుకున్నారు. వృద్ధురాలిని కలెక్టర్ సముదాయించి తనతో పాటు సమావేశ మందిరంలో ఉన్న ఛాంబర్‌కు తీసుకువెళ్లి సమస్యను తెలుసుకున్నారు. స్థానిక తహసీల్దార్ ని పిలిపించి సమస్యకు పరిష్కారం చూపించే చర్యలు చేపట్టారు. న్యాయస్థానం ఇచ్చిన ఆదేశాలను అమలుచేయాలని 14 ఏళ్లుగా రెవెన్యూ అధికారుల చుట్టూ తిరుగుతున్నా భూసమస్యకు పరిష్కారం చూపించకపోవడంతోనే ఆత్మహత్యాయత్నానికి ప్రయత్నించినట్టు వృద్ధురాలు తెలిపింది. పాత్రునివలస రెవెన్యూ పరిధి 301- 2, 302- 2, 303- 2, 304- 2, బలగ రెవెన్యూ పరిధి 307- 9లో వారసత్వంగా వచ్చిన భూమిని న్యాయస్థానం ఆదేశాల ప్రకారం తనకు ఏడోవంతు వాటాను అప్పగించాలని వృద్ధురాలు రెవెన్యూ అధికారుల చుట్టూ తిరుగుతోంది. బాధితురాలి అన్నదమ్ములు విక్రయించిన భూమి వారసత్వంగా వచ్చినది కాదని, స్వార్జితమని వారి వద్ద ఉన్న పత్రాలు, రికార్డుల ప్రాప్తికి రెవెన్యూ అధికారులు చెబుతున్నారు. బాధితురాలు ఫిర్యాదులో పేర్కొన్న భూములన్నీ క్రయవిక్రయాలు జరిగిపోయాయని, దీనిపై న్యాయస్థానంలో కేసు పెండింగ్‌లో ఉందని రెవెన్యూ అధికారులు చెబుతున్నారు. ఇదే విషయాన్ని కలెక్టర్ దృష్టికి రెవెన్యూ అధికారులు తీసుకువెళ్లారు. న్యాయస్థానంలో వివాదం ఉన్నందున దీనిపై రెవెన్యూపరంగా ఎటువంటి నిర్ణయం తీసుకోలేమని రెవెన్యూ అధికారులు చేతులెత్తేశారు.

విద్యారంగ సమస్యలపై ప్రభుత్వం న్యాయం చేయాలి

విశాలాంధ్ర - టెక్కలి : విద్యారంగ సమస్యలపై ప్రభుత్వం స్పందించి న్యాయం చేయాలని ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ ఉద్యమ కార్యాచరణలో భాగంగా సోమవారం టెక్కలి మండల కేంద్రంలో టెక్కలి, సంతబొమ్మాళి, నందిగాం ఉపాధ్యాయులు పెద్ద ఎత్తున పాల్గొని విద్యారంగ సమస్యలపై ప్రభుత్వం వెంటనే స్పందించి న్యాయం చేకూర్చాలని డిమాండ్ చేశారు. అనంతరం ఉపాధ్యాయులు కలిసి టెక్కలి తహసిల్దార్‌కి మెమోరాండం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు శ్రీనివాసరావు, బాబురావు, శ్రీనివాసరావు, మల్లేశ్వరరావు, చంద్రశేఖర్ శివప్రసాద రావు, మోహన్ రావు ధనంజయ రెడ్డి, సూర్య నారాయణ అనురాధ, తాతమనాయుడు శంకర్రావు తదితరులు పాల్గొన్నారు.

పురస్కార గ్రహీతలకు సత్కారం

విశాలాంధ్ర - కవిటి : మండలంలోని బొరివంక గ్రామస్తుల ఆధ్వర్యంలో ఉగాది పురస్కార గ్రహీతలకు ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే డాక్టర్ బెందాళం అశోక్,స్థానిక సర్పంచ్ శ్రీరాంప్రసాద్‌ల చేతుల మీదుగా గ్రామస్తులు ఘనంగా సత్కరించారు. ఈ మేరకు ఉత్తమ జర్నలిస్టుగా సుప్రీం కోర్టు మాజీ ప్రధాన న్యాయ మూర్తి జస్టిస్ ఎన్వీ రమణ చేతులు మీదుగా అవార్డు అందుకున్న పూడి సత్యనారాయణ, నాటక రంగంలో ఉత్తమ ప్రతిభ ప్రదర్శించి కందుకూరు అవార్డు అందుకున్న బెందాలం శోభన్, బల్లెడ చలపతి, ఉగాది పురస్కారం అందుకున్న చక్ర పెరుమాళ్ స్వామి ఆలయం అర్చకుడు బాలక సత్యనారాయణకు బొరివంకలో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

పట్టణంలో అనుమానాస్పద వ్యక్తులను గుర్తించండి!

విశాలాంధ్ర - నరసన్నపేట : పట్టణంలోని అనుమానాస్పద వ్యక్తులను గుర్తించాలని భారతీయ జనతా పార్టీకి చెందిన ప్రతినిధులు కోరారు. సోమవారం స్థానిక తహసిల్దార్ కార్యాలయంలో నిర్వహించిన గ్రీవెన్స్ సెల్‌లో బిజెపికి చెందిన నాయకులు తహసిల్దార్, టి. సత్యనారాయణకు వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా బిజెపి ప్రతినిధులు మాట్లాడుతూ గత కొంతకాలం నుండి పట్టణంలో ముస్లిం మతానికి చెందిన వ్యక్తులు తమ బంధువుల ఇంటికి వస్తున్నారని, వ్యాపారం పేరుతో ఇక్కడే స్థిర నివాసం ఏర్పరచుకోవడం జరుగుతుందని తెలిపారు. వారందరికీ గుర్తింపు కార్డులు ఉన్నాయో? లేవో తెలియదు అన్నారు. వీరందరి పైన ప్రభుత్వ అధికారులు దృష్టి సారించి, ముస్లింల గుర్తింపు కార్డులు తనిఖీ చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో బిజెపి ప్రతినిధులు, ఏపీ మహరణ, టంకాల సూరప్పుడు, కోరాడ రామచంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

వాట్సాప్ గవర్నెన్స్ సేవలపై గోడ పత్రిక ఆవిష్కరణ

విశాలాంధ్ర - శ్రీకాకుళం టౌన్ : రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే ప్రారంభించిన వాట్సాప్ గవర్నెన్స్ సేవలను ప్రజల్లోకి మరింత విస్తరించేందుకు అవగాహన కార్య క్రమాలు ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ప్రత్యేకంగా తయారు చేసిన గోడ పత్రికను సోమవారం ఆవిష్కరించారు. ఈ సేవల ద్వారా ప్రజలు 9552300009 నంబర్‌కు వాట్సాప్‌లో 'హాయ్' అని పంపి, లైసెన్సులు, పన్నులు, రసీదులు, పరీక్ష ఫలితాలు, టికెట్ బుకింగ్ వంటి 200 పైగా ప్రభుత్వ సేవలను సులభంగా పొందవచ్చు. గ్రామ వార్డు సచివాలయాల ద్వారా 15 ఏప్రిల్ నుంచి ఇంటింటికీ అవగాహన కార్యక్రమం జరుగుతోంది. మధ్యవర్తుల అవసరం లేకుండా సేవలు అందుబాటులోకి రావడంతో ప్రజల సమయంలోనూ ఖర్చులోనూ పొదుపు కానుంది.

విద్యుత్తుషాక్‌తో బాలికకు తీవ్రగాయలు

విశాలాంధ్ర - కవిటి : కవిటి మండలం కలసుకుద్ది గ్రామంలో మైలిపిల్లి తులసీ (13) గ్రా మంలో ఉన్న ట్రాన్స్ఫార్మర్ పక్క నుంచి నడిచి వెళుతుండగా ట్రాన్స్ఫార్మర్ దగ్గర నీరు ఉండడంతో ఆ నీటిలో కాలు పడి జారడంతో షాక్కు గురై తీవ్రగాయాలయినవి. స్థానికులు హుటాహుటిన కవిటి సామాజిక ఆసుపత్రికి తీసుకువెళ్లి ప్రథమ చికిత్సను అందించారు. మెరుగైన వైద్యం కోసం బరంపురం తరలించారు. అబ్బాయికి తల్లి కాములమ్మ ఉంది. ట్రాన్స్ఫార్మర్కు ఎర్తు సమస్య వలన జరిగిందని స్థానికులు అంటున్నారు. ఇప్పటికైన విద్యుత్శాఖ అధికారులు ఎర్త్ సమస్యను పరిష్కరించి ట్రాన్స్ఫార్మర్ చుట్టు కంచె నిర్మించాలని కోరుతున్నారు.

ప్రజా ఫిర్యాదులో 14 అర్జీలు స్వీకరణ

రెవెన్యూ డివిజనల్ అధికారి కృష్ణమూర్తి

విశాలాంధ్ర - టెక్కలి : ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని రెవెన్యూ డివిజనల్ అధికారి ఎం కృష్ణమూర్తి అన్నారు. మండల కేంద్రంలోని రెవెన్యూ డివిజనల్ కార్యాలయంలో ప్రజా ఫిర్యాదుల నమోదు మరియు పరిష్కార వేదికలో అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దరఖాస్తుదారుల నుండి 14న అర్జీలు స్వీకరించినట్లు తెలిపారు. రెవెన్యూ శాఖ-07, పంచాయతి రాజ్ -01, సర్వే అండ్ ల్యాండ్ రికార్డులు-01, మండల ప్రజాపరిషత్ అధికారి -2, రోడ్డు రవాణా -02, గృహ నిర్మాణ శాఖా -02 తదితర శాఖలకు సంబంధించి అర్జీలు స్వీకరించారు. సంబంధిత అధికారులకు ఫిర్యాదులు సిఫారిస్ట్ చేసి త్వరలోనే త్వరత్వరగా పరిష్కరించాలని ఆదేశించారు. ప్రజా ఫిర్యాదుల నమోదు మరియు పరిష్కార వేదికలో డివిజన్ స్థాయి అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

వేసవి దాహాన్ని తీర్చే తాటి ముంజలపై ప్రజల మోజు

విశాలాంధ్ర - జలుమూరు : వేసవి కాలంలో ఎక్కడ తాటి ముంజలు కనిపించినా అక్కడ ప్రజలు దానిపై మోజు చూపించి కొనుగోలు చేస్తూ ఉంటారు. జలుమూరు మండలం తిలారు రైల్వే స్టేషన్ ఆవరణలో అమ్మకం చేస్తున్న తాటి ముంజులు వద్ద అనేక ప్రాంతాల నుండి వచ్చిన ప్రయాణికులు దానిపై మోజు చూపుతున్నారు. వేలకు వెళ్లే వివిధ ప్రాంతాలకు చెందిన ప్రయాణికులు భారీ స్థాయిలో కొనుగోలు చేసుకుంటూ ఆనందాన్ని పంచు కుంటున్నారు. రాష్ట్రంలో దీనికి ప్రత్యేక వంటగా భావిస్తూ ఉంటారు.

గొట్టా బ్యారేజ్ టూ నివగాం రోడ్‌కు 2.80 కోట్లు..

విశాలాంధ్ర - హిరమండలం : మండలం అభివృద్ధి బాటలోభాగంగా రహదారులపై దృష్టి పెట్టిన పాతపట్నం ఎమ్మెల్యే మామిడి గోవిందరావు గొట్టా బ్యారేజ్ నుంచి నివగాం వరకు 2.80 కోట్లు రూపాయలతో రోడ్ మరమ్మత్తు పనులకు నిధులు మంజూరు అయినట్లు మండల టీడీపీ నాయకులు సోమవారం విలేకరుల కు తెలిపారు. ఇప్పటివరకు రహదారుల కోసం రూ.50 కోట్లు నిధులతో పనులు మెరుగుపరిచి అదనముగా ఇప్పుడు గొట్టా బ్యారేజ్ టు నివగాం రహదారి సుమారు 2.8 కోట్ల నిధులు ఎమ్మెల్యే మామిడి గోవిందరావు మంజూరు చేశారని త్వరలోనే పనులు ప్రారంభం కానున్నాయి. గొట్టా బ్యారేజీ నుండి నివగాము మాతల హద్దుబంగి వెళ్లే ప్రయాణికులకు దగ్గర మార్గం మరియు సౌకర్యంగా ఈ రహదారి ఉంటుందని శాసనసభ్యులు మామిడి గోవిందరావు కి ఎంపీపీ ప్రతినిధి తూలుగు తిరుపతిరావు మాస్టర్, మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు నాగేశ్వరరావు, ఎంజి ఆర్ యువసేన అధ్యక్షులు పోతురాజు శ్రీధర్, మరియు మండల కూటమి నాయకులు కార్యకర్తలు ప్రజలు తదితరులు కృతజ్ఞతలు తెలిపారు.

ప్రజలకు రాహుల్ గాంధీ క్షమాపణ చెప్పాలి

బీజేపీ మోర్చ జిల్లా అధ్యక్షులు జన్ని పరమేశ్వరరావు

విశాలాంధ్ర - టెక్కలి : విపక్ష నేత కాంగ్రెస్ ఎంపీ అయినటువంటి రాహుల్ గాంధీ అమెరికా వాషింగ్టన్ సిటీలో బ్రౌన్ యూనివర్సిటీలో జరిగినటువంటి ఒక కార్యక్రమంలో శ్రీరాముడుని కాల్పనిక వ్యక్తిగా అభివర్ణించడం చాలా హేనమైన సిగ్గుచేటు విషయం అని, దీన్ని బిజెపి పార్టీ తరఫున బిజెపి మోర్చ జిల్లా అధ్యక్షులు జన్ని పరమేశ్వరరావు ఖండిస్తున్నట్లు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆనాడు హిందువులను హిందూ ఉగ్రవాదులుగా అభి వర్ణించినటువంటి వ్యక్తిగా మరియు హిందువుల మనోభావాలు దెబ్బతీసే విధంగా వ్యవహరించిన తీరు కూడా చాలా విధారకరమైనటువంటి విషయమని, దీన్ని రాహుల్ గాంధీ ఇతర దేశాలలో పర్యటన చేస్తున్న సమయంలో భారతదేశాన్ని కించపరుస్తూ, తక్కువ చేసే ఉద్దేశంతో మాట్లాడితే ఊపాక్షించేది లేదని మండిపడ్డారు. ఈ విషయంలో భారత దేశ ప్రజలకు రాహుల్ గాంధీ క్షమాపణ చెప్పాలని గట్టిగా డిమాండ్ చేశారు.

అర్జీదారులు సంతృప్తి చెందేలా సమస్యలు పరిష్కరించాలి

- జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ - గ్రీవెన్స్‌కు 154 వినతులు

విశాలాంధ్ర - శ్రీకాకుళం : జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో సోమవారం జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వ్యవస్థ (పీజీఆర్ఎస్) కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ప్రజల నుండి 154 విజ్ఞప్తులను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఫిర్యాదుదారుల సమస్యలను సంబంధిత అధికారులు క్షుణ్ణంగా పరిశీలించి, క్షేత్రస్థాయికి స్వయంగా వెళ్లి పారదర్శకమైన విచారణ జరిపి, నిర్ణీత సమయంలో అర్జీదారుడు సంతృప్తి చెందేలా పరిష్కరించాలని ఆదేశించారు. ముఖ్యంగా, క్రింది స్థాయి అధికారులను కాకుండా స్వయంగా ఉన్నతాధికారులే క్షేత్రస్థాయికి వెళ్లాలని కలెక్టర్ స్పష్టం చేశారు. ప్రజల సమస్యల పరిష్కారానికి అత్యధిక ప్రాధాన్యత ఇస్తున్నామని, అందిన ప్రతి అర్జీకి సత్వర న్యాయం చేకూర్చడమే లక్ష్యమని ఆయన ఉద్ఘాటించారు. రాష్ట్ర ప్రభుత్వం కూడా పీజీఆర్ఎస్ కార్యక్రమాన్ని నిరంతరం పర్యవేక్షిస్తోందని ఆయన తెలిపారు.

ఐదు ల్యాప్ టాప్‌ల పంపిణీ : డిగ్రీ ఆపైన చదువుతున్న దివ్యాంగ విద్యార్థులకు విభిన్న ప్రతిభావంతులు, హిజ్రా, వయో వృద్ధుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఐదు ల్యాప్ టాప్ లు, ఒక టచ్ ఫోన్ ను కలెక్టర్ చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఇవి వారు చదువులు మరింత రాణించడానికి తోడ్పడతాయని కలెక్టర్ ఆకాంక్షించారు.

చలించని అధికారులు... కంపు కొడుతున్న గ్రామ పంచాయతీలు

విశాలాంధ్ర - జలుమూరు : పల్లెల్లో రోజురోజుకు అపరిశుభ్రత పెరిగిపోవడంతో గ్రామాలు చెత్త చెదారం వలన కంపు గొడుతున్నాయనే విమర్శలు విని పిస్తున్నాయి. జలుమూరు మండలం తిలారు రైల్వే స్టేషన్ కు వెళ్లే ప్రధాన రహదారి పక్కనే చెత్త పేరుకుపోయి విపరీతమైన కంపు కొడు తుందని పలువురు ప్రయాణికులు వాపోతున్నారు. అనేక ప్రాంతాల నుండి తిలారు రైల్వే స్టేషన్ నుంచి ప్రయాణాలు సాగిస్తున్నారు. రోడ్డు ప్రక్కనే భయంకరంగా చెత్త కనిపిస్తున్నా అధికారులు చలించకపోవడం అనేక విమర్శలు వినిపిస్తున్నాయి. నూతనంగా ఏర్పడిన ఉమ్మడి కూటమ ప్రభుత్వం బాధ్యతలు చేపట్టిన నెల రోజుల్లో అనేక పంచాయతీలపై పారిశుధ్య కార్యక్రమాలపై దృష్టి సారించిందని నేడు ఇటు పాలకులు అటు అధికారులు కనీస పరిశీలన చేయకపోవడం అనేక విమర్శలు వినిపిస్తున్నాయి. మండల, గ్రామస్థాయి అధికారులు దీనిని పరిశీలించి తక్షణమే పరిష్కరించాలని పలువురు కోరుతున్నారు.

పలాస కాశీబుగ్గ మున్సిపాలిటీ చైర్మన్ అభ్యర్థులపై ఉత్కంఠ..

ఏడాది కాలం ఉన్న ఎదురుచూస్తున్న ఆశావాహులు..!

విశాలాంధ్ర - పలాస : జిల్లాలో శరవేగంగా అభివృద్ధి చెందుతున్న పలాస కాశీబుగ్గ మున్సిపాలిటీలో రాజకీయాలు కూడా అంతే వేగంగా మారుతున్నాయి. ఈ ప్రాంతంలో అతిరధ మహారధులైన రాజకీయ ఉద్దండులు పరిపాలించారు. వారి కనుసన్నల్లోనే అభ్యర్థుల ఎంపిక జరిగేది. ప్రస్తుతం పాత తరం నాయకుల పాలన ముగిసి కొత్త తరం నాయకుల పాలన కొనసాగుతోంది. గతంలో నాయకులు గీసిన గీతను దాటని కార్యకర్తలు ఉండగా ప్రస్తుతం ఆ ఒరబడి కొరవడింది. ఈ నేపథ్యంలో మరో 10 నెలల్లో ప్రస్తుతం ఉన్న పాలకవర్గం ముగిసే సమయం ఆసన్నమవుతోంది. రాష్ట్ర ప్రభుత్వం మున్సిపల్ ఎన్నికలు జరిపేందుకు అడుగులు ముందుకు వేస్తే పలాస కాశీబుగ్గ మున్సిపల్ ఎన్నికలు 2026 మే లో గాని, జూన్ లో గాని జరిగే అవకాశాలు మెండుగా కనిపిస్తున్నాయి. ఇంకా ఏడాది కాలం ఉంటుండగానే అధికార కూటమి, ప్రతిపక్ష వైసిపి పార్టీలు తమ పావులు కదిపేందుకు సన్నాహాలు మొదలెట్టినట్లు తెలుస్తోంది. ఇప్పటికే కూటమిలో ఉన్న టిడిపి జనసేన బిజెపి పార్టీలకు చెందిన సీనియర్ నాయకులు చైర్మన్ పదవి కై అధినాయకత్వంను ప్రసన్నం చేసుకునే పనిలో ఉన్నట్లు సమాచారం. ఇది ఇలా ఉండగా 2000లో పంచాయతీలుగా ఉన్న పలాస కాశీబుగ్గ లను కలిపి ప్రభుత్వం నగర పంచాయతీగా ఏర్పాటు చేసింది. 2002లో మున్సిపాలిటీగా రూపాంతరం చెందిన తరువాత చైర్మన్ పదవికి ప్రత్యక్ష ఎన్నికలకు సిద్ధమైంది. రాష్ట్రంలో తెలుగుదేశం పాలనలో మున్సిపాలిటీ ఎన్నికలు జరగగా దివంగత నేతలు, రాజకీయ కురువృద్ధులు హనుమంతు అప్పయ్య దొర, డాక్టర్ కణితి విశ్వనాథంలు అప్పటి కాంగ్రెస్ చైర్మన్ అభ్యర్థి కళింగ కులానికి చెందిన వజ్జ బాబురావు విజయానికి ప్రచారం నిర్వహించారు. ఆ పోటీలలో తెలుగుదేశం పార్టీ అభ్యర్థిగా ప్రముఖ న్యాయవాది పీజీ రాజరత్నం నాయుడు (కారునాయుడు) పోటీ చేసి వజ్జ చేతిలో ఓడిపోయారు. వజ్జ ఐదేళ్ల పదవి కాలంలో పలాస కాశీబుగ్గ మున్సిపాలిటీ అభివృద్ధికి బాటలు వేశారు. అనంతరం 2007లో జరిగిన మున్సిపల్ ఎన్నికల్లో వజ్జ బాబురావు సతీమణి గంగ భవాని కౌన్సిలర్ గా పోటీ చేసి గెలుపొందిన కొన్ని సమీకరణలు మారడంతో సామాజిక న్యాయం కోసం దివంగత నేత అప్పయ్య దొర వైశ్య కులానికి చెందిన కోట్ని లక్ష్మి కి చైర్మన్ గా అవకాశం కల్పించారు. ఆమె పాలనలో కొంత మేరకు అభివృద్ధి సాధించిన ఆమె మార్కు కనిపించడం లేదు. తిరిగి 2014లో టిడిపి అధికారంలో ఉన్నప్పుడు జరిగిన మున్సిపాలిటీ ఎన్నికల్లో చైర్మన్ పదవిపై పోటా పోటీ నెలకొంది. దీంతో చైర్మన్ పదవికి మున్సిపల్ ఎన్నికల ముందే టిడిపి స్థానిక అధిష్టాన వర్గం వేలం పాట నిర్వహించారు. ఈ పాటలో చైర్మన్ పదవిని ఆశించిన లొడగల కామేశ్వరరావు యాదవ్, 20 నుండి 30 లక్షల వరకు,మల్లా శ్రీనివాసరావు 40 లక్షల వరకు కౌన్సిలర్ అభ్యర్థుల కింద ఖర్చు పెట్టేందుకు సిద్దమయ్యారు. ఈ నిధులు సరిపోకపోవడంతో వారి ప్రతిపాదనలు టిడిపి నాయకులు పక్కన పెట్టి అత్యధిక మొత్తం ఇచ్చే అభ్యర్థిపై దృష్టి సారించారు. దీంతో కోత పూర్ణచంద్రరావు ముందుకు వచ్చి ఒక కోటి 75 లక్షలు రూపాయలు ఇచ్చేందుకు అంగీకారం తెలిపారు. ఎన్నికల ఖర్చులు పెట్టేందుకు స్థానిక అధిష్టాన వర్గంకు ఆ మొత్తంను కోత చెల్లించి చైర్మన్ పదవిని కైవసం చేసుకున్నారు. కొన్నాళ్ళు సజావుగా సాగిన కోత పరిపాలనలో కొంతమంది వేలు పెట్టడంతో దీనిని వ్యతిరేకించిన కోత తనదైన శైలిలో కేవలం మున్సిపల్ సాధారణ నిధులతో అభివృద్ధి పనులు చేపట్టి మున్సిపాలిటీని అభివృద్ధిలో నడిపారు. మళ్లీ వైసిపి పాలనలో 2021 మార్చిలో జరిగిన మున్సిపల్ ఎన్నికల్లో చైర్మన్ అభ్యర్థిగా పోటీ చేసిన ప్రస్తుత మున్సిపల్ చైర్మన్ బల్ల గిరిబాబు వైసిపి కౌన్సిలర్ల కింద ఖర్చు పెట్టేందుకు ఒక కోటి రూపాయలను ఇవ్వగా మిగిలిన ఖర్చులు ఒక కోటి 65 లక్షలు అప్పటి రాష్ట్ర మంత్రి, పలాస ఎమ్మెల్యే డాక్టర్ అప్పలరాజు భరించారని ప్రచారంలో ఉంది. ఈ నేపథ్యంలో మరో 10 నెలల్లో మున్సిపల్ పాలకవర్గం ముగియనుండటంతో చైర్మన్ పదవికై ఇరుపార్టీల్లో ఆశావాహులు ఎదురుచూస్తున్నారు. కూటమి ప్రభుత్వంలో తెలుగుదేశం, జనసేన, బిజెపి పార్టీలు మిళితమై ఉండడంతో ఏ పార్టీకి చెందిన వారిని చైర్మన్ పదవికి ఎంపిక చేస్తారో అర్థం కావటం లేదు. తెలుగుదేశం పార్టీ స్థానిక అధిష్టానం నాయకులు గతంలో మాదిరిగా చైర్మన్ పదవికి వేలం వేస్తారో.. లేక కుల ప్రాతిపదికపై వెళ్తారో.. లేదా కుటుంబ నేపథ్యం చూసి అభ్యర్థి ఎంపిక చేస్తారో ఆయా పార్టీ శ్రేణులకు అర్థం కావట్లేదు.అయితే చైర్మన్ అభ్యర్థిగా టిడిపి నుండి లొడగల కామేశ్వరరావు యాదవ్, జనసేన నుండి కోత పూర్ణచంద్రరావు, అట్టాడ వాసుదేవరావు బిజెపి నుండి కంచరాన భుజంగరావు, పాలవలస వైకుంఠరావు, ఇక ప్రతిపక్ష వైసిపి పార్టీలో చైర్మన్ అభ్యర్థులుగా మాజీ పట్టణ వైసిపి అధ్యక్షులు సనపల సింహాచలం, ప్రస్తుత పట్టణ అధ్యక్షులు శిష్టు గోపి, మాజీ ఏఎంసీ చైర్మన్ పీవీ సతీష్ పేర్లు వినిపిస్తున్నాయి. కూటమి నాయకులు ఒకవేళ కులంను, కుటుంబ నేపథ్యంను ప్రాతిపదికగా తీసుకుంటే టిడిపి పార్టీలో దివంగత నేత అప్పయ్య దొర పెద్ద కోడలు, న్యాయవాది హనుమంతు సుధారాణి పేరు ముందంజలో ఉండవచ్చు.ఆ తదుపరి పార్టీకి అంకితభావంతో పనిచేస్తున్న లొడగల కామేశ్వరరావు యాదవ్, వైసీపీలో రెబల్ గా మారి టిడిపిలోకి చేరిన కళింగ కులానికి చెందిన సీనియర్ కౌన్సిలర్ దువ్వాడ శ్రీకాంత్ కూడా చైర్మన్ పదవికి ఒక పోటీదారుడే. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో టిడిపి అభ్యర్థి గౌతు శిరీష విజయానికి శ్రీకాంత్ గేమ్ చేంజర్ గా మారారు.అలాగే ప్రస్తుత చైర్మన్ గా బల్ల గిరిబాబు కొనసాగుతున్నారు. మరో 10 నెలల్లో ఆయన పదవీకాలం ముగుస్తుంది. అయితే ఆయన తాజా రాజకీయ వ్యూహం మాత్రం ఎవరికి అంతుపట్టడం లేదు. మరోసారి అవకాశం వస్తే చైర్మన్ పదవిని చేపట్టవచ్చు. ఇది ఇలా ఉండగా చైర్మన్ పదవిని ఆశిస్తున్న వారు ముందుగా కౌన్సిలర్లుగా ఎన్నికవ్వాలి. 30 వార్డ్ ల కౌన్సిలర్ల బాధ్యతలను వారే తీసుకోవాలి. అనంతరం అధిష్టానాన్ని ప్రసన్నం చేసుకోవాలి. అటు పిమ్మట చైర్మన్ గా ముళ్ళ కిరీటం ధరించాలి. ఇంతటి సాహసం చేసిన వారే చైర్మన్ పదవిని చేజెక్కించుకుంటారు. ఏది ఏమైనా చైర్మన్ పదవిని ఆశిస్తున్న ఆశవాహులందరూ మరో 10 నెలల కాలం వేచి ఉండాల్సిందే..

విశాలాంధ్ర
పేజీ 3
శ్రీకాకుళం
మంగళవారం 6, మే, 2025

ఎర్ర చెరువు హాంఫట్ ..! కోట్ల విలువ గల చెరువు భూగర్భం ఆక్రమణ..

విశాలాంధ్ర - పలాస : పలాస కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలో ప్రభుత్వ పరంగా ఉన్న భూములు, కాలువలు, చెరువులకు రక్షణ లేకుండా పోయింది. జంట పట్టణాల్లో గల ప్రభుత్వ స్థలాలు కబ్జాకు గురవుతున్నాయి. ఆక్రమార్కులు కోట్లాది రూపాయల విలువ గల ప్రభుత్వ భూములు బాహాటంగా కబ్జా చేస్తున్నప్పటికీ సంబంధిత అధికారులు చూసి చూడనట్టు వ్యవహారిస్తున్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇప్పటికే గత రెండు దశాబ్దాలుగా ఈ ప్రాంతంలో 70 కోట్లు రూపాయలు విలువ చేసే 30 ఎకరాల వరకు ప్రభుత్వ భూములు, స్థలాలు, సాగునీటి చెరువులు, కాలువలు కబ్జా జరిగినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. కబ్జాకు పాల్పడిన వ్యక్తులు అనేక మంది డి. పట్టాలు పొందినట్టు ప్రచారం జరుగుతుంది. దీంతో ప్రభుత్వ పరంగా మంజూరయ్యే అభివృద్ధి పనులకు స్థలాలు లేకుండా పోయే పరిస్థితులు నెలకొన్నాయి. భూ ఆక్రమణదారులు ఏ పార్టీ అధికారంలో ఉంటే ఆ పార్టీలో చేరి అధికారాన్ని అడ్డు పెట్టుకొని ఇటువంటి భూ ఆక్రమణలకు పాల్పడుతున్నారని భోగట్టా. దీనికి సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. మున్సిపాలిటీ పరిధిలో పురుషోత్తపురంలో గల సర్వే నెం. 29లో సుమారు 26 ఎకరాల 50 సెంట్ల విస్తీరణం గల ఎర్ర (డబ్బాల) చెరువులో కొంత భాగాన్ని ఆక్రమణదారులు దురాక్రమణ చేశారు. ఇదే పరిధిలో ఉన్న కాలువలను కూడా కబ్జా చేయడానికి ప్రయత్నాలు జరుగుతున్నాయి. ఈ మేరకు కాలువ స్థలాన్ని చదును కూడా చేశారు. కొంతమంది ఆక్రమణదారులు ఎర్రచెరువు గర్భంలో కంకరవేసి దురాక్రమణకు పాల్పడుతున్నా అటు మున్సిపల్ అధికారులు గాని, ఇటు రెవిన్యూ అధికారులు కూడా పట్టించుకోకపోవడం వెనుక మతలబు ఏమిటో తెలియటం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. ప్రభుత్వ స్థలాలు, చెరువులు, కాలువలు ఆక్రమణలకు గురవుతున్నప్పటికీ సంబంధిత యంత్రాంగం చోద్యం చూస్తున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. పలాస కాశీబుగ్గ మున్సిపాలిటీ పురుషోత్తపురం ఎర్ర చెరువు సర్వే నెంబర్ 29లో దర్జాగా భూ కబ్జాలు జరుగుతున్నాయి.చెరువు ప్రాంతాన్ని కొందరు చోటా నాయకులు ఆక్రమించి మట్టివేసి చదును చేసుకొని ఇంటి నిర్మాణాలు చేపడుతున్నారు.ఇప్పటికే ఇంటి నిర్మాణం కోసం వేసిన పిల్లర్లు దర్శనమిస్తున్నాయి. 20 ఏళ్ల క్రితం పడమర వైపు చెరువు కబ్జా కాకుండా చెరువు హద్దులు గుర్తించి ప్రహరీ గోడ నిర్మాణం చేపట్టినప్పటికీ కొందరు అవేమి పట్టించుకోకుండా సాక్షాత్తు చెరువు గర్భంలోనే ఇంటి నిర్మాణాలు చేపడుతున్నారు. అక్రమ నిర్మాణంపై స్థానిక రెవిన్యూ అధికారులు గాని మున్సిపాలిటీ టౌన్ ప్లానింగ్ అధికారులు గాని ఎందుకు చర్యలు తీసుకోవడం లేదో అర్థం కావట్లేదని స్థానికులు పేర్కొంటున్నారు. ఈ భూ కబ్జాపై వాళ్లలో వాళ్లకు మనస్పర్థలు వచ్చి స్థానిక పలాస తహసిల్దార్ టి. కళ్యాణ్ చక్రవర్తికి కొంతమంది ఫిర్యాదు చేసినట్లు తెలుస్తుంది. స్థానికంగా ఉన్న కొందరు పెద్దలు దృష్టికి ఈవిషయం వెళ్లడంతో ఇరువర్గాలు వాళ్ళను పిలిచి నచ్చజెప్పినట్లు తెలుస్తుంది. స్థలం విలువ సుమారు 30 లక్షల రూపాయలు పై మాటే ఉంటుందని ప్రచారం జరుగుతుంది. తక్షణమే జిల్లా అధికారులు తగు చర్యలు తీసుకోవాలని ప్రభుత్వ భూములు చెరువులు ఆక్రమణలకు గురి కాకుండా పరిరక్షణకు కృషి చేయాలని ప్రజలు కోరుతున్నారు.

ప్రభుత్వ ఐటీఐ స్థలం... కబ్జాకు యత్నం..!

విశాలాంధ్ర - పలాస : పలాసలో గల డాక్టర్ వి.కణితీస్ ప్రభుత్వ ఐటీఐ కళాశాల స్థలంను కబ్జా చేసేందుకు యత్నాలు జరుగుతున్నాయి. సోమవారం ఐటీఐ కళాశాల స్థలాన్ని కబ్జా చేసి పునాదులు వేసేందుకు పలాసకు చెందిన ఇద్దరు వ్యక్తులు ప్రయత్నాలు చేశారు. ఈ స్థలం ను జెసిబి ట్రాక్టర్ పెట్టి చదును చేశారు. ఈ సమాచారం తెలుసుకున్న ప్రిన్సిపాల్ పైల జవహర్ సంఘటన స్థలానికి చేరుకొని అడ్డుకున్నారు. ఆ ఇద్దరు వ్యక్తులు ప్రిన్సిపల్ పై తిరగబడుతూ అయితే సంబంధించిన కాగితాలు తిరిగి చూపించమని ప్రిన్సిపాల్ జవహర్ పై ఒత్తిడి తెచ్చారు. ఈ సమాచారాన్ని కాశిబుగ్గ పోలీసులకు ఫిర్యాదు రూపంలో అందజేశారు. అలాగే పలాస తహశీల్దార్ వి కళ్యాణ్ చక్రవర్తి, మున్సిపల్ కమిషనర్ నడిపేన రామారావు దృష్టికి తీసుకెళ్తామని సిబ్బంది తెలిపారు. సూదికొండకు వెళ్లే రహదారిలో ఉన్న ప్రైవేటు ఐటిఐ కళాశాలను మాజీ ఎం.పి డాక్టర్ కణితి విశ్వనాథం 25 సెప్టెంబరు 2010లో ప్రభుత్వానికి దారాదత్తం చేశారు. దానికి ముందు అప్పటి తహశీల్దార్ సహకారంతో సర్వే చేయించి నాటి నివేదికలు ఆధారంగా సర్వే నెం.232 /2ఎ3లో మూడు ఎకరాల 27 సెంట్లు భూమి, కోట్లాది రూపాయలు విలువ చేసే భవనాలను ఉచితంగా ప్రభుత్వ ఐటిఐ కళాశాల ఏర్పాటుకు అప్పటి ముఖ్యమంత్రి డాక్టర్ కణితి స్నేహితుడు వై.ఎస్. రాజశేఖర రెడ్డికి అప్పగించారు. ఈ ప్రాంతంలో ఎంతో మంది పేద విద్యార్థులకు ఉచితంగా సాంకేతిక విద్య అందించాలనే ఉద్దేశంతో 1980లో (ప్రైవేటు ఐటిఐ కళాశాలను స్థాపించి కాలక్రమంలో కోట్లాది రూపాయలు విలువైన భూములను, భవనాలను ఉచితంగా ప్రభుత్వానికి అందజేసి తన దాతృత్వాన్ని చాటుకున్నారు. డాక్టర్ కణితి విశ్వనాథం ఆధీనంలో ఐటిఐ కళాశాల ఉన్నంత వరకు అటు వైపు చూసేందుకు సహసించని భూబకాసురులు ఆ భూములు ప్రభుత్వం చేతుల్లోకి వెళ్లిన క్షణం నుంచి ఐటిఐలకు చెందిన ప్రభుత్వ స్థలాలపై భూబకాసురుల కన్ను పడింది. ఐటిఐ కి సెలవు దినాలలో, సిబ్బంది లేని సమయం చూసుకొని భూబకాసురులు ప్రభుత్వ ఐటిఐ స్థలాలను ఆక్రమించుకునేందుకు పునాదులు తవ్విస్తున్నారు. ఐటిఐ స్థలాలు నేడు కోట్లాది రూపాయలు పలుకుతుండడంతో భూబకాసురులు తప్పుడు పత్రాలతో తప్పుడు సర్వే నెంబర్లుతో ఇప్పటికే కొంత భాగం ఆక్రమించుకొని మిగిలిన స్థలాలను కాపాడుకునేందుకు ఐటిఐ అధికారులు సర్వశక్తులు ఒడ్డుతున్నారు. అయినప్పటికీ వారు కళ్లు కప్పి ఆక్రమణలకు పాల్పడతుండం గమనార్హం. ఈ నేపథ్యంలో ఐటిఐ ఆక్రమణల విషయాలపై ప్రిన్సిపాల్ పైల జవహార్ గతంలో కలెక్టర్ గ్రీవెన్స్ కు ఫిర్యాదు చేయడంతో అప్పటి టెక్కలి ఆర్.డి.వో కిశోర్ ఐటిఐ స్థలాన్ని పరిశీలించి పలాస సర్వేయరు చలపతిరావు చేత సర్వే చేయించి ప్రభుత్వ భూముల్లో కలిపేందుకు 22ఎలో చేర్చాలని ఆదేశించినా సర్వేయరు ఆ దిశగా చర్యలు తీసుకోకపోవడం ఆర్.డి.వో బదిలీ కావడంతో ఆ ప్రతి పాదన మూలన పడింది. ఇప్పటికైనా రెవిన్యూ అధికారులు స్పందించి ఉచితంగా కోట్లాది రూపాయలు స్థలాలను ప్రభుత్వానికి దరాదత్తం చేసిన డాక్టర్ కణితి విశ్వనాథం ఆశయాలను నేరవేర్చాలని ఐటిఐ సిబ్బంది, ప్రజలు కోరుతున్నారు. ఇది ఇలా ఉండగా ప్రభుత్వ అయితే లో దూర ప్రాంతం నుండి చదువుకుంటున్న విద్యార్థుల సౌకర్యార్థం డాక్టర్ విశ్వనాథం సోదరుడు డాక్టర్ హేమాచలం తన సొంత నిధులతోపాటు, లైన్స్ క్లబ్ నిధులతో వసతి గృహ నిర్మాణం చేపట్టారు. దానికి ఆనుకొని ఉన్న దక్షిణం వైపు ప్రభుత్వ ఐటిఐ కి చెందిన ఖాళీ స్థలమును కబ్జా చేసేందుకు ఆక్రమణదారులు ప్రయత్నిస్తున్నారు. ఈ విషయమై పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష దృష్టి సారించి ఐటిఐ స్థలం చుట్టూ కంచె ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకోవాలని విద్యార్థులు సిబ్బంది కోరుతున్నారు.

కాపలా తప్పడం లేదు : పైల జవహార్ (ఐటిఐ ప్రిన్సిపాల్)

ప్రభుత్వ ఐటిఐ కళాశాల వద్ద ఎవరు లేని సమయాల్లో ఆక్రమణలు తప్పడం లేదు. దీంతో సెలవు దినాల్లో కూడా రోజుకొకరు చొప్పున కాపలా కాయాల్సిన వస్తుందని ఐటిఐ ప్రిన్సిపాల్ పైల జవహర్ తెలిపారు. రెవిన్యూ అధికారులు ఈ ప్రాంతంలో ప్రభుత్వ స్థలమని తెలిపే బోర్డులు ఏర్పాటు చేయాలి. ఐటిఐ స్థలాలకు రక్షణ కల్పించాలి. లేకుంటే ఐటిఐ విద్యార్థులతో ధర్నాలు, రాస్తారోకోలు చేసి నిరసన తెలియజేస్తాం.

ఉపాధి పనులలో అక్రమాలు...!

- నిబంధనలు పాటించని వైనం - పర్యవేక్షణ లోపం

విశాలాంధ్ర - ఆమదాలవలస : గ్రామీణ ప్రాంతాల్లో రహదారులు కాలువలు నిర్మిం చి అభివృద్ధి చేయాలన్న ఉద్దేశంతో ప్రభుత్వం పంచాయ తీరాజ్ శాఖ ఆధ్వర్యంలో ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ నేతృత్వంలో ఎంజి ఎన్ఆర్ఈజీఎస్ నిధు లను విడుదల చేశారు. ప్రభుత్వం విధించిన నిబం ధనలను అతిక్రమించి గ్రామీణ ప్రాంతాల్లో రహదారుల నిర్మాణంలో అనేక లోపాలు వెలుగు చూస్తున్నాయి. పనులు పూర్తికాకుండానే బిల్లుల కోసం అధికారులపై ఒత్తిడి చేస్తున్నట్లు తెలుస్తుంది. ఆమదాలవలస మం డలం, టీ జొన్నవలస పంచాయతీ గ్రామీణ అభివృద్ధి కొరకు కేటాయించిన నిధులు గ్రామాల్లో ఉన్న కొందరు నాయకులు నామినేట్ కాంట్రాక్టర్ లుగా వ్యవహరించి నిధులను దుర్వినియోగం చేస్తున్నారు అన్న ఆరోప ణలు జోరుగా వినిపిస్తున్నాయి. ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్ మండలం లోని సుమారు 20 కిలోమీటర్ల దూరంలో ఉన్న ఓ మద్యం దుకాణంలో విధులు నిర్వ హిస్తున్నట్లు స్థానికులు ఆరోపిస్తున్నారు. మద్యం దుకా ణం లో ఉండగా ఉపాధి పనులు ఎలా పరివేక్షిస్తున్నా రని ప్రతిపక్ష నాయకులు విమర్శిస్తున్నారు. పనులలో జరిగిన లోపాలపై ఆడిట్ బృందం పరిశీలించి చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉంది. అలాగే పంచాయతీ రాజ్ శాఖ ఆధ్వర్యంలో గ్రామంలోని ఏబీ రోడ్ నుండి అంబటి వారి వీధి ఎస్సీ కాలనీ వరకు నిర్మిస్తున్న సిమెంట్ రహదారి కనీస నిబంధనలు పాటించడం లేదని గ్రామస్తులు ఎమ్మెల్యే వద్ద మొరపెట్టుకున్నారు. పనులు పూర్తి చేయ కుండానే బిల్లులు పొందాలను కోవడం ఎంతవరకు సమంజసం అని స్థానికులు నిలదీశారు. గ్రామ సభలో గ్రామస్తుల అనుమతితో తీర్మానం పొంది న పనులకు మాత్రమే ప్రభుత్వం నిధులు మంజూ రు చేసింది. గ్రామస్తుల ఇష్టానికి వ్యతిరేకంగా నిర్మాణాలు చేపడితే బిల్లులు చెల్లిం పులో జాప్యం ఉంటుందన్న సంగతి కాంట్రాక్టర్లకు తెలియదా అని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. ఇష్టా రాజ్యాంగ నిర్మా ణం చేస్తుంటే పనులు నిలిపి వేయిం చారు. దీంతో పంచాయతీ ఎమ్మెల్యే కార్యాలయానికి చేరింది. అధికారులు నిర్దేశించిన మేరకు రోడ్డు పనులు చేయాలని కనీసం 12 అడుగులు వెడల్పు ఉండాలని పనులు నిర్వహిస్తున్న కాంట్రాక్టర్కు ఎమ్మెల్యే కార్యా లయం ఆదేశించారు. అయినప్పటికీ ఆరు లక్షల రూపాయలు పనులు చేస్తున్నానని అధికారులు బిల్లులు చెల్లిం చడం లేదని తిరిగి ఫిర్యాదు చేశారు. పనుల నాణ్యతలు లోపిస్తే బాధ్యత వహించవలసి నదే అని జిల్లా కలెక్టర్ స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. జొన్నవలస పంచాయతీ పరిధిలో జరుగు తున్న పనులు నాణ్యతలులోపించాయని తెలుగు దేశం లోని రెండో వర్గం ఎమ్మెల్యే వద్ద ఫిర్యాదు చేసి నట్లు తెలిసింది. పిలిపించి గ్రామంలో ఏదైనా విపత్కర పరిస్థితి సంభవిస్తే ఒక అంబులెన్స్ గానీ, ఫైర్ ఇంజన్ గాని ఆ ప్రాంతానికి వెళ్లే విధంగా రహ దారులు నిర్మా ణం చేపట్టాలని స్పష్టమైన ఆదే శాలు జారీ చేశారు. దీంతో నిర్మాణ పనులు చేస్తున్న వారు చేసేదిలేక వెను తిరిగినట్లు తెలిసింది. ఈ విషయమై పంచాయతీరాజ్ ఏఈ జ్యోతి నీ ప్రశ్నిం చగా పనుల్లో నాణ్యత లేకుంటే నిబంధనలు అతిక్రమించిన బిల్లులు చెల్లించవద్దని ప్రభుత్వం నుంచి స్పష్టమైన ఆదేశాలు తమ వద్ద ఉన్నా యని బదులిచ్చారు.

పట్టణంలో తాగు నీటికి కటకట...!

- ఇంజనీరింగ్ అధికారుల అలసత్వం
- పెరుగుతున్న మోటార్ల సంఖ్య
- తొలగింపులో వివక్షత
- అధికారుల తీరుపై జనాగ్రహం

విశాలాంధ్ర - ఆమదాలవలస : పట్టణంలో రోజురోజుకి తాగునీటికి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. అసలే వేసవి ఆపై చాలీచాలని తాగునీరు వెరసి ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇది చాలదు అన్నట్టు బడాబాబు లు మోటార్లు విడిచి పెట్టే సమయంలో వన్ హెచ్ పి మోటార్లతో వారి సొంత వాడకానికి ట్యాంకర్ల నింపుకుంటున్నారు. ఇటీవల పాతినవానిపేటలో ఎస్ ఎస్ ఎన్ కళ్యాణమండపం ప్రాంతాల్లో దిగు వకు నీరు రాక తాగునీటికీ ఇబ్బందులు పడుతు న్నారు. మోటర్లు ద్వారా నీటిని నిలువురిస్తున్నట్లు అధికారులు గ్రహించినప్పటికీ పలుమార్లు యజ మానులతో చర్చలు జరిపిన ఫలితం మాత్రం శూన్యం. మోటార్లను తొలగించి కేసు నమోదు చేసేం దుకు కనీస ప్రయత్నాలు కూడా అధికారులు చేయటం లేదు అనే విమర్శలు ఉన్నాయి. కొన్ని ప్రాంతాల్లో తాగునీటి ఇబ్బందులు గుర్తించి అక్కడ జరుగుతున్న నీటి చౌర్యం పై కమిషనర్ కు నివే దించి అనుమతులు పొందవలసి ఉన్నప్పటికీ అటువంటి చర్యలు చేపట్టిన దాఖలాలు లేవు.

నీటి చౌర్యం నిలువరించేనా...!

అధికారుల నిర్లక్ష్యం కారణంగా పట్టణ ప్రజలు తాగునీటికి ఇక్కట్లు ఎదుర్కొంటున్నారు. పట్టణంలో సుమారు 4000 కుళాయి కనెక్షన్లు ఉన్నప్పటి కీ నీటి చౌర్యం మాత్రం నిలువురించ లేక పోతు న్నారు. ఇందులో 178 పబ్లిక్ కులాలు కూడా ఉన్నాయి. వంశధార నాగవల్లి పంపు హౌస్ ల వద్ద నీటి నిలువలు లేని కారణంగా పెర్కాపిట మేరకు నీరు అందించడం లేదని అధికారులు స్పష్టం చేస్తున్నారు. హ్యాండ్ బోర్లు 2004 ఉన్నాయి. రెడ్డి పేట చింతాడ ఆరో వార్డు పార్వతీశంపేట కసిం వలస ఎన్టీఆర్ కాలనీ తదితర ప్రాంతాలకు ట్యాం కర్ల ద్వారా తాగు నీటిని అందిస్తున్నారు. ఇన్ని చేసినప్పటికీ నీటి చౌర్యాన్ని ఉంచడంలో అధికా రులు వైఫల్యం చెందుతున్నారు అన్న విమర్శలు ఉన్నాయి. తాగునీటిని నివారించడంలో చర్యలు చేపడితే సుమారు ఒక్కో వార్డులో వందల సంఖ్య లో మోటార్లను సీజ్ చేయవచ్చు. లేకుంటే కులా యి పంపిణీ చేసిన సమయంలో విద్యుత్ సరఫ రాను నిలిపివేసిన కొంతమేరకు నీటి దొంగలను అరికట్టవచ్చు. నీటి దొంగలను నివారించడంలో అధికారులు మెతక వైఖరి ఊహిస్తున్నారని తెలుస్తుంది. కొన్నిచోట్ల మోటార్లు వినియోగిస్తున్నట్లు చూసినప్పటికీ ధృతరాష్ట్ర పాలన సాగిస్తున్నారు.

రోడ్డుపై గోతులు...

తాగునీటి సరఫరా లో జరుగుతున్న అంతరాయా లను సరిదిద్దేందుకు ఎక్కడికక్కడ గోతుల తవ్వు తూ నీటిని అందించే ప్రయత్నం చేస్తున్నారు. నీరు కిందికి రాకపోవడానికి గల కారణాలు స్పష్టంగా అధికారులకు తెలిసినప్పటికీ గోతులు తవ్వి వాల్వులు సరి చేయటం పనిగా పెట్టుకున్నారు. దీనితో కొన్ని పైపులు వాల్వులు మార్పు చేసినట్లు బిల్లులు చేసుకొని ప్రజాధనాన్ని దుర్వినియోగం చేస్తున్నారు. ఇదేమి పరిస్థితి అని నిలదీసిన వారికి సమితులనాటి పైపులైనని అందుకే నిత్యం మొరాయిస్తున్నాయని బాహాటంగా చెబుతు న్నారు. పట్టణ ప్రజలకు సరిపడా తాగునీరు అందించడంలో విఫలమైన అధికారులు లైన్లు మరమ్మతుల పేరుతో వేలకు వేలు ప్రజాధనాన్ని దుర్వినియోగం చేస్తున్నారు.

పెరుగుతున్న మోటార్ల సంఖ్య...!

తాగునీటిని దొంగతనంగా వారి సొంత ప్రయోజనాల కోసం ట్యాంకర్లకు ఎక్కించుకుంటూ కొంతమంది అధికారులను సైతం దిక్కిరిస్తున్నట్లు తెలుస్తుంది. మోటార్లు వినియోగించి నీటిని తస్కరించే దురుద్దేశంతో అధికార పార్టీ కండువా మోస్తున్న ట్లు బిల్డప్ అందిస్తున్నారు. వీరిని ఏమైనా అంటే పార్టీ కార్యాలయాల నుంచి ఫోన్ కాల్స్ వస్తాయి. వారి మౌఖిక ఆదేశాలతో ఏమీ చేయలేని నిస్స హాయ స్థితిలో అధికారులు వెనిజులుకుతున్నా రు. గత ప్రభుత్వ సమయంలో పూజారిపేట పాతి నివానిపేట ప్రాంతాల్లో సుమారు 20 మోటార్లను తొలగించి కార్యాలయానికి తరలిస్తున్న సమ యంలో అధికార పార్టీ నాయకుల హుకుం తో వాటిని తిరిగి అమర్చవలసిన పరిస్థితి ఏర్పడింది. అధికార ప్రతిపక్ష పార్టీల ముసుగులో కొంతమంది నీటి దొంగతనానికి పాల్పడుతున్నప్పటికీ పురపా లక సంఘ కమిషనర్ కనీస చర్యలు చేపట్టిన పాపానపోలేదు. ఎగువన ఉన్నవారు మోటార్లతో నీటిని తోడేస్తుంటే దిగువ నుండే ప్రజలకు తాగు నీరు అంతక ఇబ్బందులు పడుతున్నారు. కనీస మౌలిక సదుపాయాలైన తాగునీటిని సామాన్య ప్రజలకు అందించడంలో మున్సిపల్ అధికారులు వైఫల్యం చెందుతున్నారు. దీనికి కారణం కొన్ని చోట్ల రాజకీయ ఒత్తిళ్లు అయితే, మరికొన్నిచోట్ల మామూళ్లకు అలవాటు పడ్డ వారు కూడా లేకపో లేదు. ఇటీవల సంవత్సరాల పాటు తాగునీటి బిల్లులు చెల్లించలేదన్న ఉద్దేశంతో కుళాయిలను డమ్మీ చేసినప్పటికీ వెనువెంటనే వాటిని తిరిగి పున ప్రతిష్టించడం వెనుక ఆంతర్యం బయట పెట్టవలసి ఉంది. ఏది ఏమైనా సామాన్య ప్రజలకు తాగునీరు అందించడంలో మున్సిపల్ అధికా రులు వైఫల్యం స్పష్టంగా కనిపిస్తుంది. అక్రమంగా నీటిని తోడుతున్న మోటార్లను తొలగించి దిగువ ప్రాంతాలకు తాగునీరు అందించవలసిన బాధ్యత మున్సిపల్ అధికారులపై ఉంది.